5CTR1:5CTR1.qxd 10/4/2026 11:14 PM Page 1




# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

30 వసంతాల ప్రస్థానం వార్త వార్షికోత్సవం 1996 - 2026


## సూళ్లూరుపేటలో ఘనంగా వరల్డ్ స్పేస్ వాక్ ప్రారంభం



సూళ్లూరుపేట, అక్టోబర్ 4 ప్రభాతవార్త:

అంతర్జాతీయ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా ఇస్రో ఆధ్వర్యంలో స్పేస్ వాక్ 2026ను స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పచ్చ జెండా ఊపి ఆదివారం ప్రారంభించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఇస్రో అధికారులు, తెలుగుదేశం పార్టీ నేతలు, విద్యార్థులతో కలిసిడి ఆర్‌డిఎల్ కాలనీ వరకు నడిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ అంతరిక్ష రంగంలో భారతం దేశం సాధిస్తున్న విజయాలు ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. దేశానికే గర్వకారణమైన సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోట సూళ్లూరుపేట నియోజకవర్గంలో అంతర్భాగం కావడం ఈ ప్రాంత ప్రజలందరికీ దక్కిన గౌరవం అని చెప్పారు. విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని సైన్సు, అంతరిక్ష పరిశోధనల పట్ల ఆసక్తి పెంచుకోవాలని కోరారు. భవిష్యత్తులో దేశఖ్యాతిని మరింత ఇనుమడింపజేసే గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇస్రో అధికారులు శంకరన్, బాల మురళి, గోపికృష్ణ, ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, ఎఫ్ ఎస్ సి ఎస్ చైర్మన్ ఎజి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా కాణిపాకం తెప్పోత్సవం

### -తెప్పలపై సేదతీరిన పార్వతీతనయుడు

కాణిపాకం, అక్టోబర్ 4 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల చివరిరోజు ఆదివారం రాత్రి సిద్ధిబుద్ధి సమేతుడైన గణనాధుడు స్వామివారి పవిత్ర పుష్కరిణిలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. స్వామివారికి ఆదివారం తెప్పోత్సవం వైభవోపేతంగా జరిగింది. ఉభయ దేవేరులతో స్వామివారు స్థానిక పవిత్ర పుష్కరిణిలో తెప్పలపై విహరిస్తూ భక్తులకు అభయహస్తం అందించారు. ఆలయంలో 21 రోజుల పాటు జరిగిన వార్షిక బహ్మోత్సవాల సందర్భంగా వాహనసేవలలో ఊరేగుతూ అలసి సొలసిన స్వామి, అమ్మవార్లు చివరిరోజు తెప్పలపై విహరిస్తూ సేదదీరారు. ఈకార్యక్రమానికి కీ॥శే॥ గాలి పుండరీకనాయుడు,వారి కుమారుడు గాలి శేషాచలంనాయుడు కాకర్లవారి పల్లె, కీ॥శే॥ శ్రీ.ఆర్.శేషాద్రినాయుడు అండ్ బ్రదర్స్, కాకర్లవారిపల్లె, కీ॥శే॥ జి.హనుమంతనాయుడు వారి కుమారులు, అడపగుండ్లపల్లె, కీ॥శే॥ యం.రామకృష్ణారెడ్డి కుమారుడు ఎం.జగన్నాథరెడ్డి, కాణిపాకం, గురుజాల దామోదరనాయుడు, కొత్తపల్లె, కీ॥శే॥ చల్లగుండ్ల దామోదరనాయుడు వారి కుమారులు, కాకర్లవారిపల్లె, గురుజాల ఆనందనాయుడు అండ్ బ్రదర్స్ దిగువ మారేడుపల్లె, శ్రీలంకిపల్లె మోహన్‌బాబు, 44 బొమ్మసముద్రం.ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు ఉభయదారులు పగలు వరుస ఉభయం తీసుకురాగా ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌కు అర్చకస్వాములు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి చంనాలంకారం చేసి దేదీప్యమానంగా అలంకరించారు. అనంతరం ధూపదీపనైవేద్యాలతో విశేష సమర్పణ గావించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే పుష్కరిణిలోని స్వామివారికి సాయంత్రం అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. తిరిగి రాత్రి సిద్ధి,బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను ఆలయంలోని అలంకార మండపంలో వుంచి శోభాయమానంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను మంగళవాయిద్యాల నడుమ ఆలయం నుండి పవిత్ర పుష్కరిణి వద్దకు తీసుకువచ్చి వివిధరకాల పుష్పాలు, రంగురంగుల విద్యుత్‌ద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించిన తెప్పలపై వుంచి మరోమారు విశేషపూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల గణేష్ నామస్మరణలు మిన్నంటుతుండగా స్వామి అమ్మవార్లను పుష్కరిణిలో మూడుసార్లు ప్రదక్షిణ చేయించారు. ఈసందర్భంగా భక్తులు పుష్కరిణిలో బెల్లంను వేసి మొకు ్కలు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా చిత్తూరు డీఎస్పీ వెంకట రమణ, చిత్తూరు రూరల్ వెస్ట్ శ్రీధర్‌నాయుడు, స్థానిక ఎస్సై నరసింహులుల అధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ మణినాయుడు,ఈఓ పెంచల కిషోర్,ఏఈఓలు రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ప్రసాద్, ధనపాల్,ధనుంజయ, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, రవి, మాజీ ఛైర్మన్‌లు మోహన్‌రెడ్డి, జగన్నాథరెడ్డి, మాజీ సర్పంచ్‌లు శాంతిసాగర్‌రెడ్డి, మధుసూధన్‌రావులతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## ముడి వీడింది

### తొలగిన కోర్టు వివాదం.... ఎన్నికలకు సిద్ధమౌతున్న శ్రీకాళహస్తి



శ్రీకాళహస్తి, అక్టోబర్ 4 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మున్సిపాలిటికి సంబంధించిన ఎన్నికలకు సుమారు 7 సంవత్సరాలుగా హైకోర్టులో సాగిన పీట ముడి వీడింది.దాంతో ఎన్నికలకు అధికారులు సిద్ధం చేస్తున్నారు.అయితే 2024 నాటి ఓటర్ల జాబితా ప్రకారం ఎన్నికలు జరపాలని ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌ను కోరింది. దాంతో అన్ని మున్సిపాలిటిలకు ఒకే సారి ఎన్నికలు జరగవచ్చునసే ప్రచారం జరుగుతుంది. అయితే అధికారులు సెప్టెంబర్ నెలాఖరు వరకు రాష్ట్రంలోని కోర్టు వివాదాల్లో ఉన్న 23 మున్సిపాలిటిలకు మినహా 100మున్సిపాలిటిలకు ఎన్నికలు నిర్వహించుటకు సిద్ధమే అని ప్రకటించారు.అయితే కోర్టులో సుమారు 7 సంవత్సరాలకు పైగా సాగిన ఉత్కంఠకు తెర పడింది. ఎన్నికల నిర్వహణకు వాతావరణం సజావుగామారింది. కోర్టులో డీలిమిటేషన్‌కు సంబంధించి ప్రక్రియ సక్రంగా జరగలేదని కేసులు దాఖలయ్యాయి. అంతేకాక చుట్టుపక్కల ఉన్న గ్రామాలను మున్సిపాలిటిలో కలిపితే పన్నుల దడపుట్టిస్తాయని సదుపాయాలు సక్రమంగా అందవనే నెపంతో డీలిమిటేషన్ ప్రక్రియ సక్రమంగా జరగలేదని కోర్టులో వ్యాజం వేసారు.అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ వ్యాజ్యాన్ని ఉపసంహరించుకున్నారు.కానీ కోర్టు తీర్పు వచ్చే వరకు ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదని కాలయాపన సాగింది. గత పాలనలో జరిగిన మున్సిపల్ ఎన్నికలల్లోనూ శ్రీకాళహస్తి మునన్సిపాలిటికి ఎన్నికలు జరగలేదు.దాంతో ప్రణాళిక సంఘం నిధులు మంజూరు కాలేదు.

**ఎన్నికలకు సిద్ధం:**

డీలిమిటేషన్ ప్రక్రియతో నిర్వహించే ఎన్నికలలో ఏర్పాట్లు పూర్తి చేయటానికి అధికారులకు కనీసం ఒక నెల పడుతుంది. ప్రభుత్వం ప్రస్తుత ఎన్నికల నిర్వహణకు సంబంధించి విధి విధానాలు,ప్రక్రియకు నిబంధనలు రూపొందించి రాష్ట్రంలోని మున్సిపాలిటిలో సర్వం సిద్ధం చేసారు. ఈ నేపధ్యంలో కోర్టు తీర్పు నేపధ్యంలో ఇప్పటికే జిల్లా కలెక్టర్ శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో పరిస్థితి ఏమిటనే అంశాన్ని అధికారులతో వాకబు చేసినట్లు సమాచారం.అయితే కొత్త నిబంధనల ప్రకారం మునన్సిపల్ జనాబా 80వేలు ఉంది కాబట్టి గతంలో ఉన్న 35 వార్డుల స్థానంలో 44 చేయాల్సి ఉంటుంది. వార్డుల విభజన కొత్తగా చేపట్టాల్సి ఉంటుంది. గతంలో డీలిమిటేషన్ ప్రక్రియ సక్రమంగా జరగలేదనే కోర్టుకు వెళ్ళింది. ప్రస్తుతం కొత్త నిబంధనల మేరకు వార్డుల విభజన జరగాల్సి ఉంది.అయితే ఇక్కడి కమిషనర్ కెవి కృష్ణారెడ్డి ఎన్నికల నిర్వహణ సిబ్బందితో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ కోర్టు తీర్పు ఏ సమయంలో అయినా రావచ్చుననే సంకేతాలతో ఏర్పాట్లుపై సమీక్షించుకుంటూ ముందుకు వెళుతున్నారు.

**రిజర్వేషన్లలో ఏమౌతుందో?**

ఈ సారి ప్రభుత్వం జనరల్ ఎన్నికలను ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహణకు సిద్ధం అయ్యింది. దాంతో రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. రిజర్వేషన్లలో ఏమౌతుందో ఏమో అని ఆశావహుల్లో ఉత్కంఠత చోటు చేసుకుంది. అధికార పార్టీలో అయితే ఏ రిజర్వేషన్ వచ్చినా పోటీకి అభ్యర్థులు సిద్ధంగా ఉన్నారు. ఇక వార్డుల్లో కూడా ఆశావహుల్లో ఉత్కంఠత చోటు చేసుకుంది.అయితే స్థానిక నాయకుడు మాత్రం రిజర్వేషన్ ఏం వచ్చినా ఎవరికి అవకాశం వచ్చినా అందరం కలసికట్టుగా పని చేసుకోవాలని మున్సిపాలిటి మీద కూటమి జెండా ఎగురాలని తమ కార్యకర్తలను సిద్ధం చేస్తున్నారు. రిజర్వేషన్లు ఖరారుకానిదే ఎన్నికల వేడి ఊపందుకోదు.

**ప్రతిపక్షంలో కూడా ఉత్కంఠత:**

శ్రీకాళహస్తి మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ప్రతిపక్ష వైకాపాలోకూడా ఉత్కంఠత చోటుచేసుకుంది. ఇప్పటికే వివిధ సమీకరణలతో ప్రజల్ని ఆకర్షించే కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్నారు.స్థానిక సంస్థల ఎన్నికలలో గట్టి పోటీ ఇవ్వటానికి ప్రణాళికలు రచించుకుంటున్నారు. ఆ పార్టీలో కూడా రిజర్వేషన్లు తేలితే తరువాత చూసుకోవచ్చులే అనే ధీమాతో ఉన్నారు. అయితే ప్రజల దృష్టిలో పడటానికి సమస్యలపై స్పందన, మంచిచెడ్డలకు హాజరు కావటం మేమున్నామని గుర్తించుకోవాలని ఆకర్షిస్తున్నారు.ఈ నేపధ్యంలో ఓ ద్వితీయశ్రేణి నాయకుని జన్మదినాన్ని నిర్వహించటం పార్టీ నాయకులందరూ హాజరుకావటం స్థానిక సంస్థల ఎన్నికల సంకేతాలను పంపుతుంది.

## ఆకట్టుకున్న భరతమాత,మోదీ చిరుధాన్యాల చిత్రాలు



తిరుపతి,అక్టోబర్ 4ప్రభాతవార్త:

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాల సుపరి పాలన నిరంతర సేవలకు కృతజ్ఞతలు తెలుపుతూ బిజెపి ఆధ్వర్యంలో "సేవా సంకల్ప అభియాన్" కార్యక్రమం జరి గింది. ఆదివారం సాయంత్రం తిరుపతిలోని ఇందిరా మైదా నంలో భారీ రంగవల్లి (ముగ్గు) కార్యక్రమాన్ని ఘనం గా నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు, బిజెపి నాయకులు, కార్యకర్తలు ఉత్సా హంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి తిరుపతి జిల్లా బిజెపి అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ హాజరయ్యారు. చిరుధాన్యాలతో భరతమాత, మోదీ చిత్రపటంలతో మహిళలు వేసిన రంగవల్లి అందరినీ విశేషంగా ఆకర్షించింది. పక్షులకు ఆహారంగా ఉపయోగపడేలా నవధాన్యాలు, చిరుధాన్యాలను ఉపయోగించి భరతమాత నరేంద్ర మోదీ చిత్రపటాలతో ఈ ముగ్గును తీర్చిదిద్దారు.మహిళానాయకులు ప్రశాంతి రాజు, పుష్పలత, తేజోవతి, అనూష, అనిత, లక్షి ్మ, కవితలకు సామంచి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో దీపక్ యాద వ్, జల్లి మధుసూదన్ ,కొత్తపల్లి అజయ్ ,బాలాజీ, నరేష్,వరప్రసాద్ , శేఖర్, ఈశ్వర్,చంద్ర శేఖర్, పార్థ, పొనగంటి భాస్కర్,భవాని, రామ్ కుమార్, రెహమాన్, నాయకులు, కార్యకర్తలు

## మంత్రాల వెనుక మర్మంపై.. ఐదు రోజుల మథనం

### దర్శపూర్ణమాస యాగంలోని నిగూఢ అంశాలపై జాతీయ కార్యశాల



తిరుపతి విద్య, అక్టోబర్ 4, ప్రభాతవార్త:

వేద మంత్రాల పఠనానికే పరిమితం కాకుండా వాటి అంతరార్థం, యాగ ప్రక్రియలోని తాత్త్విక అంశాలను లోతుగా అధ్యయనం చేసే దిశగా ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో జాతీయ స్థాయి మేధోమథనం ప్రారంభమైంది. వేదభాష్య విభాగం ఆధ్వర్యంలో దర్శపూర్ణమాస ప్రకరణంపై ఐదు రోజుల జాతీయ కార్యశాలను ఆదివారం ప్రారంభించారు. విశ్వవిద్యాలయ పాలనా భవనంలోని రామేశ్వరం ప్రాంగణంలో జరిగిన ప్రారంభ కార్యక్రమానికి ఆన్‌లైన్‌లో పాల్గొన్న ప్రముఖ వేద పండితులు బ్రహ్మశ్రీ మణిద్రావిడ మాట్లాడుతూ వేదార్థాన్ని సమగ్రంగా, పరిపూర్ణంగా తెలుసుకున్నప్పుడే వేదవిద్య సార్థకమవుతుందని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి మాట్లాడుతూ శ్రౌత యాగ ప్రక్రియలకు పునరుజ్జీవం కల్పించేందుకు ఇలాంటి పరిశోధనాత్మక కార్యశాలలు అవసరమన్నారు. కాశీ నుంచి ఆన్‌లైన్‌లో పాల్గొన్న ప్రముఖ వేదపండితులు బ్రహ్మశ్రీ దెందుకూరి శ్రీరామ ఘనాపాటి వేదభాష్య అధ్యయనంలో పూర్వమీమాంసా శాస్త్రం ప్రాధాన్యాన్ని వివరించారు. శ్రీవేంకటేశ్వర వేదవిజ్ఞానపీఠం ప్రిన్సిపాల్ బ్రహ్మశ్రీ కుప్పా శివసుబ్రహ్మణ్య శర్మ, డీన్ డాక్టర్ ఎ.వి. రాధేశ్యామ్ తదితరులు ప్రసంగించారు.అక్టోబర్ 8 వరకు జరిగే కార్యశాలలో వివిధ వేదశాఖలు, కల్పసూత్రాల ఆధారంగా దర్శపూర్ణమాస యాగ విధానాలు, యాగంలోని నిగూఢ తాత్త్విక అంశాలు, ప్రయోగమంత్రాల అర్థాలపై పండితులు, పరిశోధకులు చర్చించనున్నారు. పరిశోధనా పత్రాలను సమర్పించనున్నారు. కార్యక్రమ సమన్వయకర్తగా వేదభాష్య విభాగ డీన్ డాక్టర్ ప్రవా రామకృష్ణ సోమయాజి శర్మ వ్యవహరిస్తున్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ బలభద్ర ఉపాధ్యాయ, అధ్యాపకులు, పండితులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

## మావటిపై తిరగబడిన ఏనుగు



తిరుచానూరు, అక్టోబర్ 4ప్రభాతవార్త:

తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో ఏనుగు బీభత్సం సృష్టించడంతో మావటి చంద్రారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి.ఈ సంఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. సాయంత్రం అమ్మవారి వాహన మండపంలో ఉంజల్ సేవ నిర్వహిస్తారు. ఆ సమయంలో అమ్మవారి ఏనుగులు ఆలయం వద్దకు తీసుకురావడం ఆనవాయతీ. ఊంజల్ సేవ పూర్తైన తరువాత ఏనుగులను తిరిగి ఉద్యానవనానికి తీసుకెళుతుండగా శ్రీనిధి అనే ఏనుగు ఒక్కసారిగా మావటిని కింద వేసి తొక్కివేయడంతో అతనికి రక్త వాంతులు అయ్యాయి. దీంతో భక్తులు హాహాకారాలు చేస్తూ పరుగులు తీశారు. 108 సహాయంతో గాయపడిన మావటిని ఆసుపత్రికి తరలించారు. అక్కడినుండి తిరుపతి సిమ్స్ హాస్పిటల్ కి తరలించారు.

## శ్రీసిటీలో వరుస ప్రమాదాలు..

### భద్రత గాలికి..




శ్రీకాళహస్తి అక్టోబర్ 5 ప్రభాతవార్త

పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న శ్రీసిటీ సెజ్ లో కార్మికుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందని సిఐటియు శివమెత్తింది. శనివారం శ్రీసిటీలోని టిల్ హెల్త్ కేర్ పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదం ఈ విషయాన్ని మరోసారి రుజువు చేసిందన్నారు. ఈ ప్రమాదాన్ని నిరసిస్తూ ఆదివారం శ్రీకాళహస్తి అంబేద్కర్ సర్కిల్ వద్ద సీఐటీయూ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య మాట్లాడుతూ పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పూర్తిగా లోపించాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో అగర్వాల్ స్టీల్, సోమెనీ సుధా, నియోలింక్ వంటి పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల్లో అనేకమంది అమాయక కార్మికులు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. ప్రతిసారీ ప్రమాదం జరిగినప్పుడు హడావుడిగా తనిఖీలు, విచారణ అంటూ హామీలు ఇస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని విమర్శించారు. లాభాల కోసం యాజమాన్యాలు భద్రతా నిబంధనలను పట్టించుకోవడం లేదని, అధికారులు కూడా చూసీచూడనటు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.టిల్ హెల్త్ కేర్ ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. కోటి పరిహారం చెల్లించాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పరిశ్రమల్లో ఫ్యాక్టరీ ఇన్స్‌పెక్టర్లతో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని, భద్రతా నిబంధనలు పాటించని యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అంగేరి పుల్లయ్య, గంధం మణి, కుమార్, అన్వర్ బాషా, సి గురవయ్య, అంగన్‌వాడీ నేత రేవతి, క్షేత్ర సహాయకుల సంఘం నాయకులు గురునాథం, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి మేయర్ స్థానంపై టిడిపికి తప్పని గురి !

### -సామాజిక సమీకరణాలపైనే కూటమి అడుగులు




ప్రభాతవార్త-తిరుపతి:

రాబోయే నగరపాలక సంస్థ ఎన్నికల్లో తిరుపతి మేయర్ పీఠాన్ని దక్కించుకునేందుకు తెలుగుదేశం పార్టీ సర్వసన్నద్ధమవుతోంది. నగరంలో మారుతున్న రాజకీయ, సామాజిక సమీకరణాలను పరిశీలిస్తే ఉమ్మడి కూటమి తరఫున తిరుపతి మేయర్ స్థానం టిడిపికే దక్కే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఎమ్మెల్యే స్థానాన్ని జనసేన పార్టీకి కేటాయించిన నేపథ్యంలో, నగర పరిపాలనా పగ్గాలను తమ చేతుల్లో ఉంచుకోవాలని టిడిపి శ్రేణులు గట్టి పట్టుబడుతున్నాయి. మేయర్ స్థానం జనసేనకు కేటాయిస్తారనే ప్రచారం జరుగుతున్నప్పటికీ, అది వాస్తవం కాదని టిడిపి రాష్ట్ర నాయకుడు ఒకరు సంకూతాలిచ్చారు. జనసేన నుండి ఈ స్థానం కోసం అభ్యర్థన వచ్చినా స్థానిక రాజకీయ పరిస్థితులు, సామాజిక సమీకరణాలు, కూటమి భవిష్యత్ ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని మేయర్ స్థానాన్ని టిడిపికే కేటాయించే అవకాశాలు ఉన్నాయి. తిరుపతి ఎమ్మెల్యేగా జనసేన పార్టీకి చెందిన శ్రీనివాసులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన బలిజ సామాజిక వర్గానికి చెందిన నేత కావడంతో కూటమిలోని ఇతర ప్రధాన సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో మేయర్ స్థానం జనరల్ కేటగిరీ కింద వస్తే రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతను, బిసి రిజర్వేషన్ అమలైతే యాదవ సామాజిక వర్గానికి చెందిన బలమైన నాయకుడిని బరిలోకి దించే అంశంపై కూటమి అధిష్ఠానం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ రెండు సామాజిక వర్గాల్లోనూ టిడిపికి బలమైన నాయకత్వం, పాత క్యాడర్ ఉండటంతో.. అభ్యర్థి ఎంపిక విషయంలో ఆ పార్టీకి కొంత అనుకూల పరిస్థితి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. చివరకు రిజర్వేషన్ ఖరారైన తర్వాతే మేయర్ అభ్యర్థిత్వంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రతిపక్షవైసిపి కూడా సామాజిక ఓట్ల లెక్కలపైనే ప్రధానంగా దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. మేయర్ స్థానం జనరల్ కేటగిరీలో ఉంటే బలిజ గానీ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతను, బిసిరిజర్వేషన్ వస్తే యాదవ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని బరిలోకి దించే అంశాన్ని ఆ పార్టీ పరిశీలిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఈసారి మేయర్ ఎన్నికలు ప్రత్యక్ష పద్ధతిలో ప్రజల ఓట్లతో జరిగే అవకాశం ఉండటంతో కేవలం సామాజిక సమీకరణాలు మాత్రమే గాకుండా అభ్యర్థి వ్యక్తిగత పరిచయాలు, ప్రజల్లో ఉన్న ఆదరణ, పార్టీకి ఉన్న సంస్థాగత బలం, ఆర్థిక వనరులు, క్షేత్రస్థాయి క్యాడర్ సమన్వయం వంటి అంశాలు కూడా కీలకంగా మారనున్నాయి. తిరుపతి నగర రాజకీయాల్లో దశాబ్దాలుగా పట్టున్న వైసిపి నేత భూమన కరుణాకర్ రెడ్డి వ్యూహాలను ఒంటరిగా ఎదుర్కోవడం జనసేనకు అంత సులువు కాదనే చర్చ క్షేత్రస్థాయిలో వినిపిస్తోంది.. భూమన కుటుంబానికి ఉన్న స్థానిక పరిచయాలు, కార్యకర్తల నెట్‌వర్క్, కార్పొరేషన్ స్థాయిలో ఉన్న రాజకీయ అనుభవాన్ని తిప్పికొట్టాలంటే టిడిపికి ఉన్న పాత క్యాడర్, అనుభవజ్ఞులైన నాయకత్వం, ఎన్నికల యంత్రాంగం కీలకంగా మారుతుందని కూటమి వర్గాలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రత్యేకించి తిరుపతి నగరంలో టిడిపికి ఉన్న దీర్ఘకాలిక సంస్థాగత నిర్మాణం, వార్డు స్థాయిలో ఉన్న కార్యకర్తల బలం, గత ఎన్నికల్లో పోటీ చేసిన అనుభవం.. మేయర్ ఎన్నికల్లో కూటమికి అదనపు బలంగా మారవచ్చని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. భూమన కుటుంబానికి గట్టి పోటీ ఇచ్చి కార్పొరేషన్‌ను కైవసం చేసుకోవాలంటే కూటమి తరఫున టిడిపి అభ్యర్థిని రంగంలోకి దించడం వ్యూహాత్మకంగా ప్రయోజనకరమనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. మొత్తంమీద రిజర్వేషన్, సామాజిక సమీకరణాలు, అభ్యర్థుల వ్యక్తిగత బలం, కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు, ముఖ్యంగా భూమన కుటుంబానికి ఎదురుగా బలమైన రాజకీయ యంత్రాంగాన్ని నిలబెట్టే అవసరం.

## తప్పిపోయిన బాలుర ఆచూకీ లభ్యం

### రేణిగుంటలో అదృశ్యమైన పిల్లలు మహబూబ్‌నగర్ ప్రత్యక్షం



రేణిగుంట, అక్టోబర్ 4, ప్రభాతవార్త:

రేణిగుంట గుంట కట్ట వద్ద నుంచి అదృశ్యమైన ఇద్దరు విద్యార్థుల ఆచూకీ ఎట్టకేలకు తెలంగాణలోని మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో లభించింది. రేణిగుంట అర్బన్ పోలీసులు ప్రత్యేక బృందాలతో ముమ్మరంగా గాలింపు చేపట్టి 24 గంటల్లోనే బాలురను సురక్షి తంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. పిల్లలు క్షేమంగా తిరిగి రావడంతో కుటుంబ సభ్యులు ఆనందంలో మునిగిపోయారు. తిరుపతి జిల్లా రేణిగుంట బుగ్గ వీధికి చెందిన జి. పాండురంగ (12), పి. గణేష్ రెడ్డి (15) శుక్రవారం ఆడుకోవడానికి అని రేణిగుంట గుంటకట్ట వద్దకు వెళ్లి కనిపించకుండా పోయారు. పిల్లలు ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు వెంటనే రేణిగుంట పోలీసులను ఆశ్రయించారు.విషయం తెలిసిన వెంటనే పోలీసులు అప్రమత్తమయ్యారు. పోలీసులు తక్షణం విచారణ చేపట్టడంతో పాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ వారి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. రైల్వే స్టేషన్, బస్టాండ్ ఇతర ప్రాంతాల్లోనూ గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.పోలీసులు చాకచక్యంతో సాగించిన గాలింపు చర్యలకు ఫలితం దక్కింది. శనివారం రాత్రి 11 గంటల సమయంలో మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో ఇద్దరు బాలురు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న రేణిగుంట అర్బన్ పోలీసులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా రాత్రికి రాత్రే మహబూబ్‌నగర్‌కు చేరుకుని బాలురను సురక్షి తంగా తీసుకొచ్చారు.పిల్లలు కనిపించకుండా పోయిన వెంటనే వేగంగా స్పందించి, సాంకేతిక పరిజ్ఞానం తో గాలింపును చర్యలు చేపట్టి 24 గంటల్లోనే పిల్లల ఆచూకీ కనుగొనడం తో పోలీసులు అందరి మన్ననలు అందుకుంటున్నారు. బాలురను సురక్షి తంగా కుటుంబ సభ్యులకు అప్పగించడంతో తల్లిదండ్రులు పోలీసులకు ధన్యవాదాలు

## డిఏ ఆరియర్స్ బిల్లుల సబ్మిట్‌కు ట్రైల్స్ ఓపెన్ చేయాలి

- జిల్లాల విభజనలో పారదర్శకంగా సిబ్బంది కేటాయింపుకు చర్యలు
- రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ డిమాండ్

చిత్తూరుహెల్త్, అక్టోబర్ 4 ప్రభాతవార్త:



2018 సంవత్సరం నుండి రావాల్సిన డిఏ ఆరియర్స్ బిల్లులు సబ్‌మిట్ చేయడానికి నిధి పోర్టల్‌లో అవకాశం కల్పించాలని రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ డిమాండ్ చేశారు. జిల్లా యుటిఎఫ్ కమిటీ సమావేశం యుటిఎఫ్ భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ మాట్లాడుతూ 2018 నుండి 2026 సంవత్సరం వరకు విడుదల చేసిన డిఎలకు సంబంధించి ఆరియర్ బిల్లు పెట్టుకోవడానికి సిఎఫ్ఎంఎస్లో ట్రైల్స్ ఓపెన్ చేయకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు, సిపిఎస్ ఉద్యోగులు, రిటైర్డ్ అయిన వారు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. తక్షణం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రత్యేకించి సిపిఎస్, రిటైర్డ్ అయిన వారికి రావాల్సిన డిఏ బకాయిల చెల్లింపుకు కావాల్సిన సిఎఫ్ఎంఎస్ ట్రైల్స్ ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రిటైర్డ్ అయిన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు ఎన్‌క్యాష్‌మెంట్ సరెండర్ లీవు, గ్రాట్యుటీ బకాయిల చెల్లింపుకు ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించాలన్నారు. అలాగే లోకల్ క్యాడర్ ఆర్గనైజేషన్ ఉత్తర్వులు అమలులో భాగంగా విడుదల చేసిన ఉపాధ్యాయుల సమగ్ర సీనియార్టీ జాబితాలో వున్న చిన్నపాటి లోపాలను సవరించాలని డిమాండ్ చేశారరు. ఈ సమావేశంలో జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు కె.రెడ్డప్పనాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్.మణిగండన్, జిల్లా గౌరవ అధ్యక్షులు సదాశివరెడ్డి, సహాధ్యక్షురాలు రెహెనాబేగం, డి.ఏకాంబరంలు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దీనావతి, కౌన్సిలర్ సోమశేఖర్, నాయకులు ఈశ్వర్ మహేంద్ర, పంటపల్లి సురేష్, పిసి బాబు, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు పోలీస్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

చిత్తూరుహెల్త్, అక్టోబర్ 4 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలు పరిష్కరించడానికి జిల్లా పాత పోలీసు కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుండి ఎస్పీ తుషార్ డూడి ఆధ్వర్యంలో పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కాం వేదిక కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమానికి ప్రజలు హాజరై తమ సమస్యలను ఎస్పీ తుషార్ డూడి దృష్టికి తీసుకువస్తే ఆయన వాటిని పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

చిత్తూరు, అక్టోబర్ 4 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించ డానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వ ర్యంలో సోమవారం ఉదయం 10 గంటల నుండి కలెక్టరేట్‌లోని నూత˘న సమావేశభవనంలో ప్రజా ఫిర్యా దుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమా నికి జిల్లా అధికారులు అందరు విధిగా హాజరు కావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. ప్రజల నుండి వచ్చిన సమస్యలను సత్వరం పరిశీలించి పరిష్కరించడానికి జిల్లా అధికారులు సత్వరం చర్యలు తీసుకుంటారని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో సంబంధిత అధికారులు విధిగా హాజరై ప్రజల నుండి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించి వాటిని క్షేత్ర స్థాయిలోపరిశీలించిసత్వరంపరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.

## కుస్తీ పోటీలు ప్రారంభం

గుడిపాల, అక్టోబర్ 4 ప్రభాతవార్త:

మండల పరిధిలోని నరహరిపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం అండర్-14, అండర్-17 బాల బాలికల కుస్తీ పోటీలు ప్రారంభం అయ్యాయి. ఈ పోటీలను జడ్పీ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ దుర్వాసులు, పాఠశాల కమిటీ ఛైర్మన్ ఢిల్లీభాయి రమేష్‌లు ప్రారంభించి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల నుండి ఈ పోటీలకు దాదాపు 150 మంది వివిధ కేటగిరిల ద్వారా ఎంపిక కార్యక్రమానికి విచ్చేశారన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 10వ తేదీన పల్నాడులో జరిగే రాష్ట్ర స్థాయి అండర్-14, అండర్-17 పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ కార్యదర్శి లోకనాథం, పిడిలు, కుస్తీ విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక



- కడ పి.డి. వికాస్ మర్మత్

కుప్పం, అక్టోబర్ 4 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంను సోమవారం కుప్పం మండల కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. ఉదయం 10.30గంటలనుంచి మధ్యాహ్నం 1గంట దాకా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. సమస్యలపై ప్రజలనుంచి నేరుగా వినతులు స్వీకరిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## నాయకులచే గృహమంజూరు పత్రాలు పంపిణీ



కుప్పం, అక్టోబర్ 4 ప్రభాతవార్త

కుప్పం మున్సిపాలిటీలో పిఎం ఎవై, ఎన్టీఆర్ హౌసింగ్‌లో 189 మందికి మంజూరైన గృహ నిర్మాణ పత్రాల పంపిణీని ఆదివారం ప్రభు త్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని ఆయా వార్డులకు చెందిన కౌన్సిలర్లు, స్థానిక నేతల ద్వారా లబ్దిదారులకు గృహ మంజూరు పత్రాలు అందజేశారు. మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్,సిఎం పిఏ శ్రీకాంత్, కమీషనర్ శ్రీనివాసరావు,టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శా ంతారాం, మున్సిపల్ మాజీ ఛైర్మన్ డాక్టర్ సుధీర్, ఏరియా ఆస్పత్రి వైస్‌ఛైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్, కౌన్సిలర్లు జిమ్‌దాము, సోమశేఖర్, జాకీర్, ఎంఆర్ సురేష్, టౌన్‌బ్యాంక్ ఛైర్మన్ మంజునాథ్,క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, పార్టీ విస్తరణ కమిటీ సభ్యుడు మంజునాథ్‌తో పాటు స్థానిక నేతలు, లబ్దిదారులు పాల్గొన్నారు.

## విద్యుత్ హెవీలైన్ మార్పుకు చర్యలు

కుప్పం, అక్టోబర్ 4 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో మండలంలోని మల్లానూరు పంచాయతీలో ప్రజలకు సమస్యగా మారిన 33కెవి హెవీ విద్యుత్ లైన్ మార్పుకు రెస్కో అధికారులు చర్యలు చేపట్టారు. ఆదివారం ఈపనులకు టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా ఉన్న సమస్య పరిష్కారంకు ఆదేశించిన సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పిసి సాంబశివం, కనీసవేతనాల మండలి సభ్యుడు శరవణ, కార్పోరేషన్ డైరెక్టర్ మణి, రెస్కో డైరెక్టర్లు మురళి, హారోగరన్, నేతలు విభూషణ్, దాము, సంతోష్, రమేష్ పాల్గొన్నారు.

## వైకాపా నుంచి తెదేపాలోకి భారీ చేరికలు

రామకుప్పం, అక్టోబర్ 4 ప్రభాతవార్త



మండలంలోని ప ంద్యాలమడుగు పంచాయతీలో వైకాపానుంచి తెదేపాలోకి భారీ చేరికలు జరిగాయి. ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ సమక్షంలో సుమారు 56 కుటుంబాల వారు తెదేపాలో చేరారు. ఈసందర్భంగా వారికి డాక్టర్ శ్రీకాంత్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. సిఎం చంద్రబాబునాయుడు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధితో తాము తెదేపాలో చేరుతున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సిఎ ం పిఎ శ్రీకాంత్, టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షులు ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, నేతలు మునస్వామి, పత్ర నారాయణ, కామరాజు నాయక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత ప్రమాణాలు తప్పక పాటించాలి...

- పలమనేరు టాక్సీ స్టాండ్ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజు

పలమనేరు రూరల్, అక్టోబర్ 4, ప్రభాతవార్త



ప్రతి డ్రైవరు రోడ్డు భద్రత ప్రమాణాలను తప్పక పాటించాలని, పలమనేరు టాక్సీ స్టాండ్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజు ఆదివారం ప్రత్యేకమైన సమావేశం నిర్వహించి డ్రైవర్లకు పిలుపునిచ్చారు. సుమారు 42 మంది డ్రైవర్ల అసోసియేషన్‌తో కూడుకున్న పలమనేరు కార్ టాక్సీ స్టాండ్ నందు డ్రైవర్లతో సమావేశమై డ్రైవర్లకు దిశ నిర్దేశం చేశారు. ప్రస్తుతం మారుతున్న తరుణంలో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల రోడ్డు భద్రత ప్రమాణాలపై రవాణా శాఖ తీసుకుంటున్న నూతన విధివిధానాలపై ప్రతి ఒక్క డ్రైవరు తప్పనిసరిగా ప్రయాణికుల భద్రతే శ్రీరామరక్షగా విధి నిర్వహణలో రోడ్డు భద్రత ప్రమాణాలపై సీటు బెల్టు, అలాగే ట్రాఫిక్ నిబంధనలు, డ్రంక్ అండ్ డ్రైవ్‌తో పాటు తప్పనిసరిగా నిబంధనలకు లోబడే డ్రైవింగ్ వృత్తిని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. మారుతున్న ట్రాఫిక్ నిబంధనలను అనుగుణంగా డ్రైవర్ యొక్క వృత్తి నైపుణ్యాన్ని పెంచుకొని ప్రయాణికుల పట్ల నిబద్ధతతో క్రమశిక్షణగా మెలగాలని, అలా లేని ఎడల ప్రస్తుతం ఉన్న శిక్షలకు గురికాక తప్పదని డ్రైవర్లకు హెచ్చరించారు. నిత్యం ఏదో ఒక సందర్భంలో సమాజంలో చిన్న చూపు ఉన్న భావనలను తావు ఇవ్వకుండా నూతన వరవడితో డ్రైవర్ల పట్ల నమ్మకంతో ప్రయాణికుల మన్ననలను పొందాలని కోరారు. ఇదే తరహాలో ప్రభుత్వం టాక్సీ డ్రైవర్ల కొరకు మరెన్నో పథకాలను, రూపుదిద్ది రిటైర్డ్ అయిన డ్రైవర్ల కొరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కింద ఆర్థిక సహాయం అందించే విధంగా, ప్రభుత్వానికి తమ ట్రాక్సి డ్రైవర్ల అసోసియేషన్ తరపున రాష్ట్ర ప్రభుత్వం నివేదికను అందించనున్నట్టు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డ్రైవర్ల అసోసియేషన్ తరపున మద్దతు తీసుకుని మెమరాండం త్వరలోనే ప్రభుత్వానికి అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

## దాతలచే ఉచిత ప్రసాదాల పంపిణీ

కాణిపాకం, అక్టోబర్ 4 ప్రభాతవార్త:



కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజు ఆదివారం జరిగిన తెప్పోత్సవం సందర్భంగా పలు వురు దాతలు భక్తులకు ఉచిత ప్రసా దాలను పంపిణీ చేశారు. స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ముఖ్య మైన ఉత్సవ రోజుల్లో పలువురు దాతలు భక్తులు ఉచిత ప్రసాదాలను పంపిణీ చేస్తుంటారు. ఈమేరకు ఆదివారం జరిగిన తెప్పోత్సవం సందర్భంగా పలువురు దాతలు ఆలయ వద్ద ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమాన్ని ఆలయ ఈఓ పెంచల కిషోర్ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ మధుసూధన్‌రావులతో పాటు ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## ఈనెల 6న కాణిపాకం హుండీల లెక్కింపు

కాణిపాకం,అక్టోబర్ 4 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో ఈనెల 6న హుండీల లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. స్థానిక ఆస్థాన మండపంలో ఉదయం 7 గంటలకు స్థానిక యూనియన్ బ్యాంకు వారిచే జరిగే హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది తప్పక హాజరు కావాలని కోరారు.

## వరసిద్ధుని దర్శించుకున్న టీటీడీ ఈఓ

కాణిపాకం, అక్టోబర్ 4 ప్రభాతవార్త:



తిరుమల తిరుపతి దేవస్థానముల ఈఓ ముద్దాడ రవిచంద్ర ఆదివారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్నా రు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ రాజగోపుం వద్ద ఈఓ కె.పెంచల కిషోర్,అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు.వారి వెంట ఆలయ ఏఈఓ రవీంద్రబాబు,ప్రోటోకాల్ ఏఈఓ దనపాల్, సూపరెండెంట్ వాసు, ఆలయ పాలకమండలి సభ్యులు నాగరాజులునాయుడు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## గణనాధునికి మొగిలీశ్వరుని పట్టువస్త్రసాలు సమర్పణ

కాణిపాకం, అక్టోబర్ 4 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అన్నవరం మొగిలి స్వయంభు శ్రీ మొగిలీశ్వరస్వామి దేవస్థానం తరపున స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను అందజేశారు. ప్రతి ఏటా కాణిపాకం దేవస్థానంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా మొగిలీశ్వర దేవస్థానం తరపున పట్టువస్త్రాలను సమర్పించడం ఆనవాయితీ. ఈమేరకు ఆదివారం మొగిలి దేవస్థానం అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కమలనాథ్‌రెడ్డి, వంశపారపర్యం ధర్మకర్త ఎంబి.విజయ్‌కుమార్, అర్చకులు, పాలకమండలి సభ్యులు కాణిపాకం ఆలయం ఛైర్మన్ వి.మణినాయుడు, ఈఓ ఈఓ కె.పెంచల కిషోర్‌లతో కలసి స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను అందజేశారు. ఈమేరకు పట్టువస్త్రాలను స్థానిక దేవస్థానం అతిథిగృహం నుండి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయంలో అందజేశారు. వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం రాజగోపురం వద్ద ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పట్టువస్త్రాలను స్వామివారం ఎదుట వుంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. వీరికి ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేసి స్వామివారి తీర్థ, ప్రసాదాలను, శేషవస్త్రాలను, స్వామివారి చిత్రపటాలను అందజేశారు. ఈకార్యక్రమంలో కాణిపాకం ఆలయ పాలకమండలి సభ్యులు కృష్ణవేణి, సునీత, రాజ్యలక్ష్మి, అనసూయ, చంద్రకళ, శ్రీవాణి, నరేష్, శివప్రసాద్, సతీష్, ఏఈఓలు రవీంద్రబాబు, ధనపాల ,, సూపరెండెంట్ వాసు,అర్చకులు,వేదపండితులు పాల్గొన్నారు.

## పాళ్యంకొండ అభివృద్ధికి సహకారం

- తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులును కలిసి విన్నవించిన కమిటీ సభ్యులు

గుడిపాల, అక్టోబర్ 4 ప్రభాత వార్త:



గుడిపాల మండల పరిధిలోని పాళ్యంకొండ ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు సహ కారం అందించాలని తిరుపతి ఎమ్మె ల్యే ఆరణి శ్రీనివాసులును ఆది వారం పాళ్యంకొండ ఆంజనేయస్వామి ఆల య అభివృద్ధి కమిటీ సభ్యులు కలిసి విన్నవించారు. తిరుపతిలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును కలిసిన దేవాలయ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను పాళ్యంకొండ ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు టిటిడి దేవస్థానం ద్వారా పాల్యంకొండ దేవస్థానం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును కలిసిన కమిటీ సభ్యుల్లో అధ్యక్షులు గుర్రప్పనాయుడు, ఉపాధ్యక్షులు మోహన్, కమిటీ సభ్యులు తారకరామ్, రమేష్, రాజు, సురేంద్రనాయుడు, గోవిందనాయుడు తదితరులు వున్నారు.

## జగన్ అమలు చేసిన పథకాలే శ్రీరామరక్ష

పెనుమూరు, అక్టోబర్ 4 ప్రభాతవార్త:

రాష్ట్రంలో వైకాపా అధికారంలో వున్న సమయంలో సిఎంగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్ని వర్గాల సంక్షేమం కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలే వైకాపాకు శ్రీరామ రక్ష అని జిల్లా వైకాపా కార్యనిర్వాహక కార్యదర్శి, కాపు నాయకులు దూది మోహన్ పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైకాపా బలపరచిన అభ్యర్థుల గెలుపుకు గతంలో సిఎంగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి లబ్దిదారులు బ్యాంకు ఖాతాల్లో నేరుగా నిధులు చేసిన లబ్దిపొందిన వారు కృషి చేస్తారన్నారు. సిఎంగా వైఎస్ జగన్ వున్న సమయంలో బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారికి ఏడాదికి రూ.25 వేలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారన్నారు. ప్రస్తుతం అధికారంలో వున్న కూటమి ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతూ కాలం గడుపుతోందని, ప్రజా సంక్షేమంను పూర్తిగా విస్మరించిందని ధ్వజమెత్తారు. పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతి పేరిట కూటమి ప్రభుత్వం భారీగా నిధులు దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైకాపా గెలుపుతో ఈ విషయం స్పష్టం అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్లే లక్ష్యం

ఆర్‌టిసి వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

కుప్పం, అక్టోబర్ 4 ప్రభాతవార్త



రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఏపీఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పి.ఎస్ మునిరత్నం అన్నారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ భవన్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు . బీసీలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతోనే స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ల అమలుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించిందన్నారు. బీసీలకు న్యాయం జరిగేలా అవసరమైన చట్టపరమైన ప్రక్రియను కూడా కొనసాగిస్తుందన్నారు. ఏ వర్గానికి అన్యాయం జరగకుండా, అందరి హక్కులను కాపాడుతూ రిజర్వేషన్లను అమలు చేయాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. గతంలో కూడా బీసీలకు రాజకీయంగా అవకాశాలు కల్పించిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదేనని చెప్పారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నది రాజకీయ ప్రయోజనం కోసం తీసుకున్న నిర్ణయం కాదని, బీసీలకు దక్కాల్సిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. రిజర్వేషన్ల విషయంలో ఎలాంటి అపోహలకు తావులేకుండా బీసీలకు పూర్తి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సమావేశంలో పిఎంకె ఉడా ఛైర్మన్ డాక్టర్ బి ఆర్ సురేష్ బాబు, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, ఏఎంసీ ఛైర్మన్ జిఎం రాజు, ఏరియా ఆస్పత్రి వైస్ ఛైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్,గంగమ్మ గుడి ఛైర్మన్ రవిచంద్రబాబు, టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, నేతలు చంద్ర, సుగుణమ్మ, జెకె సంతోష్ తదితరులు ఉన్నారు.

## రూ.4.47 కోట్లతో అభివృద్ధి పనులు

గుడిపాల, అక్టోబర్ 4 ప్రభాతవార్త:



గుడిపాల మండల పరిధిలో పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో రూ.4.47 కోట్లతో 42 సిమెంటు రోడ్లు, ఒక బిటీ రోడ్డు నిర్మాణానికి అనుమతులు మంజూరైనట్లు దీనికి సంబంధించిన పనులు త్వరలో ప్రారంభించనున్నామని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు, జిజెఎం చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు గురజాల చెన్నకేశవులు నాయుడులు పేర్కొన్నారు. గుడిపాల అన్న క్యాంటీన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పల్లెపండుగు 3.0 పనులకు త్వరలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు అందరు పాల్గొని విజయవంతం చేయాలని, గ్రామాల అభివృద్దే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు తీస్తుందని వారు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం పల్లె పండుగ 1.0, పల్లె పండుగ 2.0 కార్యక్రమంలో రూ.12 కోట్లతో మండల పరిధిలో సిమెంటు రోడ్ల నిర్మాణం, డ్రైనేజీల నిర్మాణం, భవనాలు నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వంద శాతం కూటమి తరపున పోటీ చేసే అభ్యర్థులు విజయం సాధించేలా పక్కాగా కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. అలాగే మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో దివంగత సీఎం, తెలుగుదేశం వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీఆర్ విగ్రహం నిర్మాణ ఏర్పాట్లు త్వరితంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బాలసుబ్రమణ్యం యాదవ్, ఉపాధ్యక్షులు ధనసింగ్, మాజీ ఎంపిపిలు దీపశ్రీ అనిల్‌కుమార్, నాగరాజుయాదవ్, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి గోళ్ళ హేమాద్రినాయుడు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పీటర్, క్లస్టర్ ఇన్‌ఛార్జీ శరత్‌బాబు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటీసీలు, గ్రామ కమిటీ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో అత్యధిక స్థానాలు గెలుస్తాం

- మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

బైరెడ్డిపల్లి, అక్టోబర్ 4 ప్రభాతవార్త



త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో వైకాపా అత ్యధిక చోట్ల విజయం సాధిస్తుందని మాజీ మంత్రి, పు ంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం బైరెడ్డిపల్లిలో ఓ వివాహ కార్యక్రమంకు ఆయన హాజరై అనంతరం మీడియాతో మాట్లాడారు. బిసిలకు 34శాతం రిజర్వేషన్లపై తమ పార్టీ కూడా సుప్రీంకోర్టును ఆశ్రయిస్తుందన్నారు. పార్టీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అమలు చేయని హామీల గురించి ప్రజలకు వివరిస్తామన్నారు. మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియజేస్తామన్నారు. సమావేశంలో వైకాపా రాష్ట్ర నేత కృష్ణమూర్తి, స్థానిక నేతలు నాగభూషణం, దయానంద గౌడు తదితరులు పాల్గొన్నారు.

## నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ

చిత్తూరురూరల్, అక్టోబరు 4 ప్రభాతవార్త:



నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించి వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై వుందని సపోర్టు సంస్థ అధ్యక్షులు పి జోసెఫ్‌రాజు తెలిపారు. ఆదివారం చిత్తూరు నగరపాలక సంస్థ మెప్మా సహకారంతో సపోర్టు సంస్థ నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి గృహంలో ఈనెల 10వ తేది ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవంను పురస్కరించుకొని ముందస్తుగా నిరాశ్రయులకు దుప్పట్లను పంపిణీ చేసారు. నిరాశ్రయులు తాము ఒంటరివారమని బాధ లేకుండా కుటుంబసభ్యులతో కలసి వుండే ఆహ్లాదకర వాతావరణాన్ని వసతిగృహంలో కల్పిస్తున్నామని జోసఫ్‌రాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో వసతిగృహ సిబ్బంది ప్రమీల, శ్రీజ, శ్రీను, ఇంద్రాణి తదితరులు పాల్గొన్నారు.

## పలమనేరు బాలాజీకి గార్లపాటి సాహితీ అవార్డు

పలమనేరు, అక్టోబర్ 4 ప్రభాతవార్త:

ప్రముఖ కవి రచయిత విమర్శకుడు పలమనేరు బాలాజీ గార్లపాటి సాహితీ అవార్డు కు ఎంపికయ్యారు. ఉరి పేరును ఇంటి పేరుగా మార్చుకొని మూడున్నర దశాబ్దాలుగా సాహిత్యంలో కథలు.కవితలు. నవలలు.విమర్శనా రంగాల్లో విశేషంగా కృషి చేస్తున్న పలమనేరు బాలాజీ పెద్దపంజాణి ఎంపిడిఓగా పని చేస్తున్నారు. ఈయనతో పాటు కొలకలూరి మధు జ్యోతి. సాకం నాగరాజు. యువశ్రీ మురళి. పత్తిపాటి రమేష్ ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 18న తిరుపతిలో జరిగే కార్యక్రమంలో వీరంతా ఈ అవార్డు అందుకుంటారు. వివిధ రచయితల సంఘాల ప్రతినిధులు. సాహితీ సంస్థలు. జనవిజ్ఞానవేదిక నాయకులు అభినందించారు.

## నేడు ఎమ్మెల్యే ప్రజా దర్బార్

చిత్తూరుహెల్త్, అక్టోబర్ 4 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు తన కార్యాలయంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి నగదర తెలుగుదేశం మైనార్టీ, క్రిస్టియన్ సెల్, ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యులు, నాయకులు హాజరు కానున్నారు.

## దళితవాడల పేర్ల మార్పునకు చర్యలు

- అంబేద్కర్, గాంధీ, ఎన్టీఆర్, వల్లభాయ్ పటేల్ వంటి మహనీయుల పేర్లకు ప్రాధాన్యం

పూతలపట్టు, అక్టోబర్ 4, ప్రభాతవార్త

ప్రభుత్వ ఉత్తర్వులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో మాలపల్లి, మాదిగపల్లి, హరిజనవాడ, దళితవాడ వంటి పేర్లను తొలగించి గౌరవప్రదమైన పేర్లు పెట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. కుల ప్రాతిపదికన ఉన్న పేర్ల వల్ల సమాజంలో వివక్ష భావనకు అవకాశం ఉండటంతో వాటి స్థానంలో అందరికీ ఆమోదయోగ్యమైన పేర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సూచించింది.ఇకపై ఆయా ప్రాంతాలకు జ్యోతిరావు పూలే నగర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నగర్, మహాత్మా గాంధీ నగర్, ఎన్టీఆర్ నగర్, సర్దార్ వల్లభాయ్ పటేల్ నగర్ వంటి పేర్లను పెట్టడంతో పాటు స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ నాయకులు, ప్రముఖుల పేర్లను కూడా పరిశీలించవచ్చు. కులం, వర్గం ఆధారంగా ప్రాంతాలను గుర్తించే పాత పేర్లకు స్వస్తి పలికి, సమానత్వం, సామాజిక గౌరవం, ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించే పేర్లను ఏర్పాటు చేయడం స్వాగతించదగిన పరిణామం. ఈ మార్పుల ద్వారా గ్రామాల్లో ప్రతి ఒక్కరూ సమానమే అనే భావన మరింత బలపడుతుందని ప్రజలు ఆశిస్తున్నారు. అధికారులు ప్రభుత్వ ఆదేశాలను క్షేత్రస్థాయిలో అమలు చేసి, గ్రామ పంచాయతీల సహకారంతో కొత్త పేర్లను అధికారిక రికార్డుల్లోనూ, నేమ్ బోర్డుల పైనా నమోదు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# తిరుపతి డివిజన్

## శునకాల దాడిలో గాయపడ్డ దుప్పి

కుప్పం, అక్టోబర్ 4 ప్రభాతవార్త



మండలంలోని కంగుంది అటవీ ప్రాంతం సమీపంలోని చిలకాల వంక నగర్ ప్రాంతంలో ఆదివారం ఓ దుప్పి శునకాల బారిన పడింది. అటవీ ప్రాంతంలోనుంచి వచ్చిన దుప్పిని చూసిన శునకాలు దానిపై దాడికి యత్నించాయి. దీంతో గాయాలతో దుప్పి రోడ్డు పక్కన పడి ఉండగా స్థానికులు గుర్తించి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అటవీ అధికారులు హుటిహుటిన అక్కడకు చేరుకుని దుప్పిని పరిశీలించి చికిత్స నిమిత్తం తరలించినట్లు డిఆర్వో సమీర్‌బాషా తెలిపారు.

## ఉత్తమ ఉపాధ్యాయురాలుగా సరళమ్మ

పుల్లంపేట, అక్టోబర్ 4 ప్రభాతవార్త :



ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతిలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పుల్లంపేట మండలానికి చెందిన శ్రీ ప్రత్యూష హై స్కూల్ లో ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్న కోట సరళమ్మను ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపిక చేసి తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కుమార్, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ సుగుణమ్మ చేతుల మీదుగా కోటా సరళమ్మకు బెస్ట్ టీచర్ అవార్డ్ అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఆమె అందిస్తున్న సేవలు, విద్యార్థుల అభ్యున్నతికి చేస్తున్న కృషిని గుర్తించి ఈ అవార్డును ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, సత్యవేడు ఎమ్మెల్యే మురళీమోహన్ తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం బెస్ట్ టీచర్ అవార్డు రావడం పట్ల శ్రీ ప్రత్యూష హై స్కూల్ కరస్పాండెంట్ కాసల భాను ప్రసాద్, ఉపాధ్యాయులు వాసు, కృష్ణ, రహిమాన్, మహబూబ్ బి, నాగ లక్ష్మిరజినిసురేష్ ప్రసన్న రెడ్డమ్మ జ్యోతి బాలాజీ బాబు తదితరులు కోట సరళమ్మను అభినందిం చారు.

## సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

పుల్లంపేట, అక్టోబర్ 4 ప్రభాతవార్త :



పుల్లంపేట మండల వ్యాప్తంగా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆదివారం రైల్వే కోడూరు శాసనసభ్యుడు అరవ శ్రీధర్, తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి, మండల తెలుగుదేశం పార్టీ బాధ్యుడు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో అనారోగ్యంతో ఆసుపత్రిపాలై ఎక్కువ డబ్బులను ఖర్చు చేసుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వచ్చిన రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే కోడూర్ మార్కెట్ కమిటీ వైయస్ చైర్మన్ చిన్నం శివయ్య,కె రామకృష్ణయ్య , బోడ వెంకటరమణ, పోలి రామచంద్రారెడ్డి, కేసినేని నారాయణ నాయుడు, బొగ్గడి రామచంద్రారెడ్డి,సింగం ఆదినారాయణ రెడ్డి, దిగదారి, మురళి, అనపాల చంద్ర, తదితరులు పాల్గొన్నారు

## మద్యం షాపులకు దరఖాస్తుల గడువు పొడిగింపు

రైల్వే కోడూరు రూరల్, అక్టోబర్ 4 ప్రభాతవార్త



రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ఖాళీగా ఉన్న మద్యం షాపులకు దరఖాస్తులు ఈనెల 6 వరకు పొడిగించినట్లు రైల్వేకోడూరు ఎక్సైజ్ సీఐ టి కె తులసి తెలియజేశారు. ఆదివారం ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోని రైల్వేకోడూరు ప్రొవిజన్ అండ్ ఎక్సైజ్ పరిధిలోని ఖాళీగా ఉన్న మద్యం షాపులకు ఈనెల 6 వరకు దరఖాస్తుదారులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా మద్యం షాపులకు లాటరీ పద్ధతిలో లైసెన్సుదారులను ఎంపిక చేస్తారని అభ్యర్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించుటకు మరియు సంబంధించిన తేదీని ఈనెల 6కు పొడిగించినట్లు తెలిపారు. ఇందులో రైల్వేకోడూరుకు ఆరు, చిట్వేలుకు ఒకటి, ఓబులవారిపల్లికి ఒకటి ఖాళీగా ఉన్నాయని నియోజకవర్గంలో దాదాపు 8 ఖాళీగా ఉన్న మద్యం షాపులకు దరఖాస్తుదారులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేయాలని ఆమె పేర్కొన్నారు.

## మైనర్ బాలికపై నేరానికి పాల్పడిన నిందితుడు అరెస్ట్

రైల్వేకోడూరు రూరల్, అక్టోబర్ 4 ప్రభాతవార్త

మండలంలోని సెట్టిగుంట పంచాయతీ అబ్బినాయుడుపల్లికి చెందిన ఒక మైనర్ బాలికను అదే గ్రామానికి చెందిన చీరాల రమేష్ బాబు అఘాత్యానికి పాల్పడిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో రేణిగుంట డిఎస్పి వై శ్రీనివాసరావు చాకచక్యంగా అరెస్టు చేశారు. నిందితున్ని అరెస్టు చేసిన అనంతరం చతపరమైన నిబంధనల ప్రకారం అవసరమైన వైద్య పరీక్షలు మరియు ఇతర విధివిధానాలను పూర్తిచేసి తదుపరి జ్యూడిసియల్ కస్టడీ నిమిత్తం కోడూరు కోర్టు ఎదుట హాజరు పరచడం జరిగిందని మైనర్ బాలికకు సంబంధించిన కేసు కావడంతో బాధిత బాలిక గుర్తింపు వ్యక్తిగత వివరాలు కుటుంబసభ్యు వివరాలు బహిర్గతం చేయకుండా బాలికకు సంబంధించిన వివరాలను గోప్యతను కాపాడుతూ చట్టపరమైన నిబంధనలప్రకారందర్యాప్తు కొనసాగిస్తున్నామని రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు విలేకరులకు తెలియ జేశారు.

## షటిల్ కీడా పోటీల్లో నల్లపురెడ్డిపల్లి స్కూల్ విద్యార్థి జిల్లా స్థాయికి ఎంపిక

పెనగలూరు, అక్టోబర్ 4 ప్రభాతవార్త



పెనగలూరు మండలం షటిల్ క్రీడా పోటీల్లో పెనగలూరు మండలం నల్లపురెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి మహీధర్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు కృష్ణ మూర్తి, పీడీ హరినాథ్ తెలిపారు. శనివారం రాజంపేట ఉన్నత పాఠశాలలో జరిగిన డివిజనల్ స్థాయి పోటీలలో మహీధర్ అద్భుత ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి కి ఎంపిక అయిన విద్యార్థిని ప్రధానోపాధ్యాయులు, పీడీ, ఉపాధ్యాయుల బృందం అభినందించారు.

## టీడీపీ అనుకూల కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం

.. వైసీపీ అనుబంధ కాంట్రాక్టర్లకే పనులు దక్కుతున్నాయనే ఆరోపణలు

రైల్వే కోడూరు అర్బన్, అక్టోబర్ 4 ప్రభాతవార్త.

నియోజకవర్గంలో ప్రభుత్వ అభివృద్ధి పనుల కాంట్రాక్టుల కేటాయింపు, బిల్లుల చెల్లింపుల వ్యవహారంపై వివాదం నెలకొంది. టీడీపీకి అనుకూలంగా ఉన్న కాంట్రాక్టర్లు చేపట్టిన పనులకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని, మరోవైపు గతంలో వైసీపీతో అనుబంధం ఉన్న కొందరు వ్యక్తులు పనులను ముందుండి నిర్వహిస్తూ బిల్లులు పొందుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పనులు కేటాయించే సమయంలో ఒక విధానం, బిల్లులు చెల్లించే సమయంలో మరో విధానం ఎందుకు అమలవుతోందనే ప్రశ్నలు కాంట్రాక్టర్లలో వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ పనులకు సంబంధించిన టెండర్లు, వర్క్ ఆర్డర్లు, కొలతల పుస్తకాలు, బిల్లుల ఆమోదం, చెల్లింపుల తేదీలను బహిర్గతం చేస్తే అసలు వాస్తవాలు బయటపడతాయని వారు అంటున్నారు. ఒకే నిబంధనలు అందరికీ వర్తించాల్సి ఉండగా, రాజకీయ అనుబంధాల ఆధారంగా పనులు లేదా బిల్లుల విషయంలో తేడాలు ఉంటే అది పారదర్శకతపై ప్రశ్నలు లేవనెత్తుతుందని స్థానిక కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు. వైసీపీ అనుబంధ వ్యక్తులే ముందుండి పనులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు నిజమైతే, వారికి ఏ ప్రాతిపదికన పనులు అప్పగించారు? అధికారిక కాంట్రాక్టర్ ఎవరు? బిల్లులు ఎవరి పేరుతో చెల్లించారు? అనే వివరాలను అధికారులు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై డ్రోన్ నిఘా.

చిట్వేలి, అక్టోబర్ 4 ప్రభాతవార్త:



రాబోయే స్థానిక ఎన్నికల నేపథ్యంలో తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు రేణిగుంట డీఎస్పీ వై. శ్రీనివాసరావు, కోడూరు రూరల్ సీఐ డి. శ్రీనివాసులతో కలిసి ఆదివారం ఓబులవారిపల్లి, చిట్వేలి, పుల్లంపేట మండలాల్లోని సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలను సందర్శించారు. ఆయా ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంపులు, ప్రహరీ, రాకపోకల మార్గాలు, భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. డ్రోన్ కెమెరాల ద్వారా పోలింగ్ కేంద్రాల పరిసరాలు, రహదారులు, కీలక ప్రాంతాలను ఏరియల్ సర్వే నిర్వహించారు. ఎన్నికల సమయంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ఈ నిఘా చేపట్టినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పుల్లంపేట ఎస్ఐ వి. చిన్న రెడ్డెప్ప, చిట్వేలి ఎస్ఐ ఎస్. వినోద్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుచ్చి వాహనంపై శ్రీ కోదండరాముడు

చంద్రగిరి, అక్టోబర్ 4 ప్రభాతవార్త:



శ్రీనివాస మంగాపురంలో వెలసిన కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం శ్రీ కోదండరాముల వారు తిరుచ్చి వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీరామచంద్రమూర్తి స్వామి వారి జన్మనక్షత్రం పునర్వసు నక్షత్రంను పురస్కరించుకుని శ్రీసీతాలక్ష్మణ, ఆంజనేయస్వామి సమేతుడై వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకృతులై తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపినాథ్, సూపరింటెండెంట్ హరికృష్ణ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ద్వారక మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ఆనుంబట్టు ధనశేఖర్, ఓఎస్ బైరెడ్డి హరిప్రసాద్, అర్చకులుమురళికృష్ణమాచార్యులు,విష్ణుస్వామి, రాజేష్ స్వామి, సెక్యూరిటీ సంతాన కృష్ణన్ పాల్గొన్నారు.

## శ్వాసమీదే ధ్యాస ఉంచండి..!

కైలాష్ గురూజీ

రామచంద్రాపురం, అక్టోబర్ 4 ప్రభాతవార్త:



శ్వాసమీదే ధ్యాస ఉంచాలని ప్రాణయోగ ఆశ్రమ వ్యవస్థాపకులు కైలాష్ గురూజీ అన్నారు. ఆదివారం కొత్తకండ్రిగ సమీపంలోని ప్రాణయోగ ఆశ్రమంలో గురూజీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆయనకు పుష్పాగుచ్ఛాలు అందజేసి దుశ్శాలువలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యాయామంతో జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవచ్చని సూచించారు. వ్యాయామం ఒక అలవాటుగా అలవరుచుకోవాలన్నారు. ఆశ్రమం ఆధ్వర్యంలో పేదలకు, విద్యార్థులకు పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో టిడిపి సీనియర్ నాయకుడు వార్తాల శివ యాదవ్ ఆశ్రమ సిబ్బందితో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## సారా ఊట ధ్వంసం

విజయపురం, అక్టోబరు 4 ప్రభాతవార్త:



జిల్లా ఎస్పీ తూషార్ డూడి ఆదేశాల మేరకు నగరి డీఎస్పీ చంద్రశేఖర్ సూచనల మేరకు నగరి రూరల్ ఇన్‌స్పెక్టర్ వి.భాస్కర్ ఆధ్వర్యంలో విజయపురం పోలీస్‌స్టేషన్ ఎస్ఐ వెంకట సుబ్బయ్య, సిబ్బందితో కలిసి కోసలనగరం రెవెన్యూ పరిధిలోగల ఫారెస్టు ఏరియాలో నాటుసారా తయారీ స్థావరాలపై దాడి చేసి రెండు వందల లీటర్ల నాటు సారా తయారీకి సిద్ధం చేసిన ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ నాటుసారా తయారీ, అమ్మకాలు చట్టరీత్యా నేరమని, చట్ట వ్యతిరేకంగా ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవన్నారు. నాటుసారా తయారీ, అమ్మకాలపై సమాచారం అందించి నిరోధానికి సహకరించాలని ఆయన సూచించారు.

## రౌడీ షీటర్లకు గాజులమండ్యం పోలీసుల కౌన్సెలింగ్

రేణిగుంట, అక్టోబర్ 4, ప్రభాతవార్త:



శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడకుండా రౌడీ షీటర్లు నేరాలకు దూరంగా ఉండాలని రేణిగుంట రూరల్ సీఐ మంజునాథరెడ్డి సూచించారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు, రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు సూచనలతో గాజులమండ్యం పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ మంజునాథరెడ్డి కౌన్సిలింగ్ ఇస్తూ గతంలో జరిగిన నేరాలను పునరావృతం చేయకుండా, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించడం, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, గొడవలకు పాల్పడటం వంటి చర్యలకు స్వస్తి పలికి బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించాలని హితవు పలికారు. పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని, రౌడీ షీటర్ల ప్రవర్తనపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని తెలిపారు. ఎవరైనా నేరాలకు పాల్పడినా, ప్రజలకు ఇబ్బందులు కలిగించినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కౌన్సెలింగ్ ద్వారా మార్పు తెచ్చుకుని ప్రశాంత జీవనం సాగించాలని సూచించారు.కార్యక్రమంలో ఎస్సై హరీష్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వర్గ విభేదాలు వీడి.. ఐక్యంగా సాగండి

పార్టీ శ్రేణులకు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సూచన

పాకాల, అక్టోబర్ 4 ప్రభాతవార్త

స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వైఎస్సార్‌సీపీ పాకాల మండలంలో పార్టీ కార్యక్రమాలను ముమ్మరం చేసింది. చంద్రగిరి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆదివారం మండలంలోని పలు పంచాయతీల్లో పర్యటించి పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత, వర్గ విభేదాలను పక్కనపెట్టి పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేయాలని సూచించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే గ్రామాల వారీగా కార్యాచరణ రూపొందించుకుని ఎన్నికలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. బైనపల్లి, సామిరెడ్డిపల్లి, చెన్నుగారిపల్లి, ఇరంగారిపల్లి, పంటపల్లి, లింగనపల్లి, కే.వడ్డేపల్లి, ఆదెనపల్లి పంచాయతీల్లో ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం పోరాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని సూచించారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని మోహిత్‌రెడ్డి కోరారు.

## పంచాయతీ ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ సమాయత్తం

చిన్నగొట్టిగల్లు, అక్టోబర్ 4 ప్రభాతవార్త:



పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ క్షేత్రస్థాయి కార్యకలాపాలను ముమ్మరం చేసింది. ఆ పార్టీ రాష్ట్ర విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఆదివారం చిన్నగొట్టిగల్లు మండలంలోని దిగవూరు, ఎగవూరు, తిప్పిరెడ్డిగారిపల్లి, నెల్లుట్లవారిపల్లి, జంగావాండ్లపల్లి, చిన్నగొట్టిగల్లు పంచాయతీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలతో సమావేశమై పార్టీ బలోపేతం, ఎన్నికల సన్నద్ధత, క్యాడర్ సమన్వయంపై దిశానిర్దేశం చేశారు. అంతర్గత విభేదాలను పక్కనపెట్టి సమష్టిగా పనిచేసి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యుగంధర్‌రెడ్డి, సహదేవరెడ్డి, సింహాల మోహన, బాబీ, శంకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి,అక్బర్, బావాజీ, భాస్కర్ రెడ్డి, డమరక, ఖదీర్ అహ్మద్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సమాయత్తం కావాలి

బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్




రేణిగుంట, అక్టోబర్ 4, ప్రభాత వార్త: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ పిలుపునిచ్చారు. రేణిగుంట మండలం అల్లికేశం గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మన ఊరు-మన జెండా' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.జిల్లా కార్యవర్గ సభ్యులు యతీంద్ర రెడ్డి అధ్యక్షతన, మార్కెట్ కమిటీ సభ్యురాలు జయకుమారి సమన్వయంతో జరిగిన కార్యక్రమంలో కోలా ఆనంద్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మండల కార్యవర్గ సమావేశంలో కోలా ఆనంద్ మాట్లాడుతూ బూత్ స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు పార్టీని బలోపేతం చేయాలని సూచించారు.ప్రతి గ్రామంలో ప్రజలతో మమేకమై కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాలను విజయవంతం చేసి, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలని సూచించారు.పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు రాబోయే ఎన్నికల్లో ఎన్డీయే విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోలా ఆనంద్ కోరారు.కార్యక్రమంలో రాష్ట్ర వన్నెకుల క్షత్రియ డైరెక్టర్ తేజోవతి, జిల్లా ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం రెడ్డి, ప్రధాన కార్యదర్శులు భాస్కర్, పురుషోత్తం, వేణు, ఆనంద్, మునివేలు, మునస్వామి, సిద్ధయ్య, శేఖర్, రాజశేఖర్, రవి, సంతోష్, హరీష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సురుటుపల్లి పల్లికొండేశ్వరుని శ్రీ దేవీ నవరాత్రి ఉత్సవ ఆహ్వానం

నారాయణవనం, అక్టోబర్ 4 ప్రభాతవార్త :



సత్యవేడు నియోజకవర్గం నాగలాపురం మండలంలో ప్రసిద్ధి చెందిన శ్రీ మరగదాంబిగ సమేత శ్రీ పల్లికొండేశ్వరుని ఆలయంలో ఈనెల 11నుంచి20వతేది వరకు శ్రీ దేవీ నవరాత్రి ఉత్సవాలు జరగనుంది. ఈ ఉత్సవాలకు సంబందించి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వారి నివాసానికి వెళ్లి ఆలయ కార్యనిర్వాహణాధికారిణి లత, అర్చకులు మర్యాద పూర్వకంగా కలిసి గోడ పత్రికను అందించి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను దుశ్శాలువతో సత్కరించిన తర్వాత వేదమంత్రాలతో ఆశీర్వాదించారు. అనంతరం స్వామి అమ్మవారి మహా ప్రసాదాన్ని అందజేశారు

## సిఎం రిలీఫ్ ఫండ్ 6.96లక్షల చెక్కులను అందించిన ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, అక్టోబర్ 4 ప్రభాతవార్త :



సత్యవేడు నియోజకవర్గంలో పలు అనారోగ్య సమస్యలకు చికిత్స పొందిన లబ్ధిదారులకు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదివారం ఉదయం ముఖ్యమంత్రి సహాయ నిధి క్రింద మంజూరైన 6,95,899 నగదుకు సంబందించి చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎఎంసి ఛైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, మాజీ ఎంపిపిలు మురళి, సుబ్రమణ్యం, మాజీ ఎంపిటిసి సెల్వకుమార్, భాస్కర్‌శెట్టి, అరుల్ ప్రకాష్, ఎస్ఎం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నడకదారిన తిరుమలకు భీమినేని చిట్టిబాబునాయుడు

– దుర్గసముద్రంలో టీడీపీ నేతల ఘన స్వాగతం

తిరుపతి రూరల్, అక్టోబర్ 4 ప్రభాతవార్త:



తెలుగు దేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి భీమినేని చిట్టిబాబు నాయుడు తిరుమలకు నడకదారిన బయలుదేరిన సందర్భంగా ఆదివారం దుర్గసముద్రం గ్రామంలోని మూలస్థానమ్మ గుడి వద్ద టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ప్రతి ఏటా తిరుమలకు నడిచి వెళ్లడం ఆనవాయితీగా కొనసాగిస్తున్న ఆయనకు ఈసారి కూడా స్థానిక నాయకులు సాలువా కప్పి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీ పట్ల నిబద్ధత, ఆధ్యాత్మిక విశ్వాసం కలగలిపిన ఈ యాత్రకు నాయకులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునిశేఖర్, బాబు రాయల్, కుమార్, మిథున్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## పాకాలలో మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరం

పాకాల, అక్టోబర్ 4 ప్రభాతవార్త

పాకాల పట్టణంలో ఆదివారం మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. లైన్స్ క్లబ్ ఆఫ్ పాకాల ప్లాటినం అధ్యక్షులు జి. గురుస్వామి నాయుడు, ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు) ప్రిన్సిపాల్ రెడ్డి రామరాజు ఆధ్వర్యంలో, శ్రీ వెంకటేశ్వర అరవింద్ నేత్ర వైద్యశాల సహకారంతో, జిల్లా అంధత్వ నివారణ శాఖ ఆదేశాల మేరకు ఈ శిబిరం నిర్వహించారు. డాక్టర్ లక్ష్మీప్రదీశా, పీఆర్వోలు జీవన్, శంకర్‌తో పాటు వైద్య సిబ్బంది 172 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. వీరిలో 19 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. శస్త్రచికిత్సకు ఎంపికైన వారికి ఉచిత బస్సు ప్రయాణం, భోజన సదుపాయం కల్పించడంతో పాటు శస్త్రచికిత్స అనంతరం తిరిగి పాకాలకు తీసుకువచ్చి చేర్చనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కళాశాల కోఆర్డినేటర్ రెడ్డి ప్రతాప్, విద్యార్థులు పాల్గొని శిబిరం విజయవంతం కావడానికి సహకరించారు. లైన్స్ క్లబ్ సభ్యులు కే.ఎన్. తులసీరామన్, జి. రామయ్య, దొరస్వామి నాయుడు, రాజేంద్ర నాయుడు, ఆంజనేయులు, కృష్ణమూర్తి, ఆనందాచారి, జయరాం నాయుడు, క్యాబినెట్ అధికారులు రామచంద్రరెడ్డి, రీజియన్ చైర్‌పర్సన్ సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

కమిషనర్ జయకృష్ణ

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 4 ప్రభాతవార్త



నేడు నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ జయకృష్ణ, ఐఏఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో అక్టోబర్ 5 వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఫోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 08772227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని తెలియజేశారు. అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, పనిచేయు ఫోన్ నంబర్లను పొందుపరచాలని కమిషనర్ తెలిపారు.

## భవన నిర్మాణాల్లో నిబంధనలు పాటించని వారిపై చర్యలు

కమిషనర్ ఎం.జయకృష్ణ

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 4 ప్రభాతవార్త



నగరపాలక సంస్థ పరిధిలో పట్టణ ప్రణాళిక నిబంధనలు పాటించకుండా జరుగుతున్న నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ టౌన్ ప్లానింగ్ అధికారులు ఆదేశించారు. ఆదివారం ఉదయం నగరంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న భవన నిర్మాణ పనులను పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. నగరంలో జరుగుతున్న భవన నిర్మాణాలను అధికారులు సిబ్బందితో కలిసి పరిశీలించాలని తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులు ఉన్నాయా? నిబంధనల మేరకు పనులు జరుగుతున్నాయా? అనే విషయాలను అధికారులు తనిఖీ చేస్తూ ఉండాలని తెలిపారు. ఎవరైనా అనుమతులు లేకుండా, నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేపడితే వెంటనే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిబంధనలు పాటించకుండా ఏవైనా నిర్మాణాలు జరిగినట్లు తన దృష్టికి వస్తే సంబంధిత అధికారులు, సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమిషనర్ వెంట ఇంచార్జి డిసిపీ మూర్తి, టిపివో వంశీ, టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు, తదితరులు ఉన్నారు.

## బిసి రిజర్వేషన్లపై చంద్రబాబు మారోసారి మోసం

బిఎస్పి రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్

చంద్రగిరి, అక్టోబర్ 4 ప్రభాతవార్త:



బిసి రిజర్లేషన్లపై చంద్రబాబు మరోమారి మోసం చేశారంటూ బిఎస్పి రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్ దుయ్యబట్టారు. స్థానిక టవర్ క్లాక్ వద్ద ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2012లో ప్రకటించిన బిసి డిక్లరేషన్ హామీ నేటికీ అమలుకు నోచుకోలేదని ఎద్దేవా చేశారు. గత నెలలో చంద్రబాబు బిసిలకు స్థానిక సంస్థల ఎన్నికలలో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని అన్నారనీ, ఈ విషయంపై ఎవరైనా కోర్టును ఆశ్రయిస్తే వారు బిసి ద్రోహులుగా మిగిలిపోతారని అన్నట్లు గుర్తు చేశారు. అయితే ఈ విషయంలో చంద్రబాబు మాటలు నర్మగర్భంగా ఎవరో ఒకరు కోర్టుకు వెళ్ళాలని ప్రేరేపించినట్లుగా వున్నాయనీ ఆరోపించారు. న్యాయవాది తాండవ యోగేష్ కోర్టుకు వెళ్ళడంతో ప్రభుత్వం ఇచ్చిన జీఓ చెల్లదని కొట్టేసిందనీ, ఇది తమ అనుమానాలకు బలాన్నిచ్చిందన్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వమే వున్నందున ప్రధాని నరేంద్రమోడీని ఒప్పించి 50 శాతం రిజర్వేషన్ల అమలుపై తన చిత్తశుద్ధి చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్పి చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏ.నాగరాజు, మండల అధ్యక్షుడు ముత్తకూరు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# 15 కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలు : ఎమ్మెల్యే నెలవల



సూళ్లూరుపేట, అక్టోబర్ 4 ప్రభాతవార్త: పల్లెపండుగ 3.0 ద్వారా నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో 15 కోట్ల రూపాయల వ్యయంతోరోడ్ల నిర్మాణాలను చేపట్టనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ వెల్లడించారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో భాగంగా ఆమె మాట్లాడారు. పల్లె పండుగ 1.0, 2.0 ద్వారాని యోజకవర్గం లోని అనేక గ్రామాల్లో ఇప్పటికే రోడ్ల నిర్మాణాలను చేపట్టడం జరిగిందని తెలిపారు. అలాగే సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాలిటీలకు సంబంధించి డ్రైనేజీలు, రోడ్లు, మంచినీటి వసతుల కల్పనకు 41 కోట్ల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసిందని ఆమె చెప్పారు. అర్హులైన వారందరికీ త్వరలో పెన్షన్లు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటికే పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి విషయంలో 90 శాతం పరిశీలన పూర్తయినట్లు ఆమె చెప్పారు. సూళ్లూరుపేట పట్టణంలో చిన్న వర్షం పడిన పలు చోట్ల వర్షపు నీరు నిలిచిపోయి పరిస్థితి ఉందని, ఈ పరిస్థితిని అధికమించేందుకు ముఖ్యమైన డ్రైనేజీ సమస్యను త్వరలోనే పరిష్కరించడం జరుగుతుందని ఆమె తెలిపారు. పట్టణ సుందరీకరణ పనులను చేపట్టి సూళ్లూరుపేటను అందమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. రాబోయే మూడేళ్లలోని యోజకవర్గంలో మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని ఇందుకు నాయకులు, కార్యకర్తలు అధికారుల సహకారం అవసరమని ఆమె తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లవలసిన బాధ్యత పార్టీ శ్రేణులు పై ఉందని చెప్పారు. ప్రజా దర్బార్ కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత సమస్యల పైన ఎక్కువగా వినతి పత్రాలు వస్తున్నాయని వీటిని పరిశీలించి ప్రతి వినతి పత్రానికి ప్రాధాన్యత నిచ్చి న్యాయం చేయడం జరుగుతుందని అన్నారు. ప్రజా దర్బార్ కార్యక్రమంలో భాగంగా వివిధ సమస్యలపై ప్రజలు 51 వినతి పత్రాలను ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, శ్రీ చెంగాళమ్మ అభివృద్ధి కమిటీ సభ్యులు తిరువూరు సుధాకర్ రెడ్డి, ఎఫ్ఎస్‌సిఎస్ చైర్మన్ ఏజీ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి

**-శ్రీసిటీలోని టిల్ ఫార్మా పరిశ్రమను జనావాసాలకు దూరంగా తరలించాలి**



సత్యవేడు, అక్టోబరు 4 ప్రభాతవార్త: సత్యవేడు శ్రీసిటీ పరిధిలోని టిల్ హెల్త్‌కేర్ పరిశ్రమలోజరిగిన పేలుడులో ఐదుగురుకార్మికులు మృతి చెందడం యాజమాన్య నిర్లక్ష్యానికి నిదర్శనమని సీఐటీయూ నాయకులు ఆరోపించారు. మృతుల కుటుంబాలకు కలిగిన నష్టాన్ని ఏ పరిహారంతోనూ భర్తీ చేయలేదని, అయినప్పటికీ ఒక్కో కుటుంబానికి రూ.50 లక్షలు సరిపోవని, రూ.కోటి చొప్పున పరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ప్రమాదానికి బాధ్యులైన యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పారిశ్రామిక ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం ఈ మేరకు తీర్మానించింది. శ్రీసిటీ ప్రత్యేక ఆర్థిక మండలిలోని టిల్ పరిశ్రమను జనావాసాలకు దూరంగా తరలించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ప్రమాదాల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకునే వరకు దశలవారీగా ఆందోళనలు కొనసాగించాలని నిర్ణయించింది. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి మాట్లాడుతూ నాయుడుపేట ప్రత్యేక ఆర్థిక మండలిలోని ఒక పరిశ్రమలో మూడు సార్లు ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, కార్మికులకు తీవ్ర గాయాలు సంభవించాయని గుర్తు చేశారు. ఈ ఘటనలపై జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరులకు వినతిపత్రం ఇచ్చి చర్యలు కోరినా, పరిస్థితిలో గణనీయమైన మార్పు కనిపించక పోవడం ఆందోళనకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక కోడ్‌లతో గతంలో ఉన్న భద్రతా నిబంధనలు బలహీనపడ్డాయని, యాజమాన్యాలు తమ భద్రతా ప్రమాణాలను తామే ప్రకటించుకునే విధానం ప్రమాదకరమని మురళి విమర్శించారు. పరిశ్రమల అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అయితే లాభాల కోసం కార్మికుల ప్రాణాలను ఫణంగా పెట్టే ధోరణిని అడ్డుకోవాలని అన్నారు. మానవ హక్కుల సంఘాలు, కార్మికశాఖ అధికారులు, సంబంధిత ప్రభుత్వ యంత్రాంగం కఠినంగా వ్యవహరించినప్పుడే ఇలాంటి ప్రమాదాలు నివారించగలం అని పేర్కొన్నారు. టిల్ పరిశ్రమ ఘటనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ధర్నా నిర్వహించనుందని మురళి తెలిపారు. పారిశ్రామిక ప్రమాదాల నివారణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రశ్నిస్తూ జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని ప్రకటించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.జయచంద్ర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి టి.సుబ్రహ్మణ్యం, తిరుపతి నగర కార్యదర్శి బుజ్జి,నగర అధ్యక్షుడు పార్థసారథి, నగర నాయకులు వేణుగోపాల్, వాసు, రఘు, శ్రీరాములు, ఎం.డి.శ్రీనివాసులు, మురళి, రాధాకృష్ణ, దాసు, వి.ఎస్.మన్యం తదితరులు పాల్గొన్నారు.

## బైక్‌పై ఎంపి, ఎమ్మెల్యే...రోడ్ల విస్తరణ పనుల పరిశీలన



చిత్తూరురూరల్, అక్టోబరు 4 ప్రభాతవార్త: నగరంలో జరుగుతున్న రహదారుల విస్తరణ, అభివృద్ధి పనులను ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ పరిశీలించారు. ఆది వారం ఉదయం ఇద్దరూ ఒకే బైక్‌పై పలమనేరు రోడ్డులో జరుగుతున్న రహదారుల విస్తరణ పనులను పర్యవేక్షించారు. రోడ్లు, కాలువల నిర్మాణంపై అధికారులతో చర్చించారు. న్యూట్రిన్ ఫ్యాక్టరీ వద్ద రోడ్డు విస్తరణకు అడ్డుగా వున్న అమ్మవారి ఆలయాన్ని స్థానికుల వినతిమేరకు మరోచోట నిర్మిస్తామని తెలిపారు. రోడ్డు విస్తరణకు ప్రజలు సహకరిస్తున్నారనీ, చిత్తూరు నగరాన్ని అందమైన నగరంలా తీర్చిదిద్దుతామని తెలిపారు. కట్టమంచి- ఎంయస్‌ఆర్ సర్కిల్ వరకు నాలుగు వరసల రహదారి విస్తరణకు రూ. 37కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తెదేపా నగర అధ్యక్షుడు వరుణ్‌కుమార్, నాయకులు రాజేష్‌కుమార్‌రెడ్డి, కాజూరు బాలాజీ, ఎంఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఏసిపి నాగేంద్ర, స్థానిక కూటమినాయకులు పాల్గొన్నారు.

## సామూహిక గీతా పారాయణం



తిరుపతి, అక్టోబర్ 4 ప్రభాతవార్త: అభయ హస్త గోవింద సేవా మండలి అధ్యక్షుడు ప్రవచనకర్త చంద్రమౌళి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం జ్ఞానామృత సత్సంగం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో సామూహిక శ్రీమద్భగవద్గీత పారాయణం, కర్మయోగంపై ఆధ్యాత్మిక సందేశం, హరినామ సంకీర్తన భజనలు భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. నగర సంకీర్తన మండలి అధ్యక్షుడు గుండాల గోపీనాథ్‌రెడ్డి పర్యవేక్షణలో వాసుదేవ రెడ్డి ఆధ్వర్యంలో నగర సంకీర్తన మండలి భక్తబృందం ఆలపించిన భజనలు శ్రోతలకు శ్రవణానందాన్ని, ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించాయి. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఉభయదాతలుగా పద్మశ్రీ- విజయ శేఖర్‌రెడ్డి దంపతులు, రాజేశ్వరి-శ్రీనాథ్‌రెడ్డి దంపతులు ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఆదివారం సాయంత్రం తిరుపతి లీలామహల్ సెంటర్‌లో జ్ఞానామృత సత్సంగం, సామూహిక గీతా పారాయణం, హరినామ సంకీర్తన, భజన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయని, ఆధ్యాత్మిక చింతన, గీతా జ్ఞానం, భగవన్నామ స్మరణతో జీవితాన్ని పావనం చేసుకోవాలని భక్తులందరికీ నిర్వాహకులు ఆహ్వానం పలికారు.

# వర్షాభావంతో తల్లడిల్లుతున్నాం...ఆదుకోండి

**-కేంద్ర బృందానికి వేడాం రైతుల మొర**



శ్రీకాళహస్తిరూరల్,అక్టోబర్ 4 ప్రభాతవార్త: గతంలో ఎన్నడూ లేని విధంగా వర్షాభావంతో తల్లడిల్లుతు న్నాము. ఇప్పటికే పంట పొలాలు నార్లుతో కళ కళ లాడుతుండాలి.అలాంటిది బీళ్ళుగా వదలిపెట్టి ఉన్నాము.ఈ పరిస్థితిలో కేంద్ర ప్రభుత్వం సహాయం అందించి ఆదుకోవాలని ఆదివారం శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో పర్యటించిన కేంద్ర వ్యవసాయశాఖ సహాయమంత్రి రామ్‌నాద్ ఠాకూర్, కేంద్ర ఉద్యానవన శాఖ కమిషనర్ ప్రభాత్ కుమార్‌లను రైతులు అభ్యర్థించారు. రాయలసీమను ఉద్యాన వన హబ్‌గా మార్చనున్న ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా ఎక్కడెక్కడ అనుకూల పరిస్థితులున్నాయో క్షేత్ర స్థాయిలో పరిశీలించుటకు కేంద్ర సహాయ మంత్రి ఠాకూర్,కమిషనర్‌తో కలసి పర్యటిస్తున్నారు.ఈ నేపథ్యంలో ఆదివారం వారు శ్రీకాళహస్తి నియోజకవర్గానికి రాగా స్థానిక శాసనసభ్యుడు సుదీర్‌రెడ్డి ఆదేశాలతో తెలుగుదేశం నాయకులు కమిటిని వేడాం పరిసరాల్లో పర్యటింపజేసారు. సువర్ణముఖి తీరాన గల గ్రామాలల్లోనే పంటలు లేక భూములను ఎండబెట్టి ఉండటం మంత్రి గమనించారు. అలాగే కొందరు రైతులు రక రకాల కూరగాయలు, ఉద్యానవన పంటలను వేసి ఉండటంగమనించిన మంత్రి ఠాకూర్ అభినందించారు. రైతుల్లో చైతన్యాన్ని ఆయన హర్షించారు. వేడాం పంచాయతీలో రైతు బాలిరెడ్డి ఎడెకరాల పొలంలో వేసిన పంటలను మంత్రి ఠాకూర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆయన అచరిస్తున్న వ్యవసాయ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు.

ప్రతి ఏడాది తాము రెండు పంటలు పండిస్తున్నామని అయితే ఈ ఏడాది వర్షాభావంతో పాటు ఎల్‌నిరో ప్రభావంతో వర్షాలు కురవక పోవటంతో ముందస్తు ఖరీఫ్‌లో వ్యవసాయం చేయలేకపోయామని మంత్రికి వివరించారు. రబీసీజన్‌లో ఇప్పటికే నార్లు పోసుకొని ఉండాలని స్వర్ణముఖి నది పారి బావులు బోర్లలో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండాలని అలాంటిది ఈ ఏడాది ఇప్పటి వరకు చినుకు రాలక రైతులు తిప్పలు పడుతున్నామని మంత్రికి వివరించారు. రైతులు పండించే సమయంలో గిట్టుబాటు ధరలు ఉండటం లేదని నేడు బియ్యం కిలో రూ.80లు అమ్ముతున్నారని మంత్రి దృష్టికి తెచ్చారు. వ్యవసాయం గడిస్తేకానీ కుటుంబాలు సాగని పరిస్థితి మాదని వివరించారు. ఈ కష్ట,క్లిష్ట తరుణంలో ప్రభుత్వం ఆదుకోవాలని మంత్రికి మొరబెట్టుకు న్నారు. రైతుల గోడును విన్న మంత్రి తప్పక ప్రభుత్వం ఆదుకుంటుం దన్నారు. అందుకే ఉద్యాన వన పంటలు లాభదాయకమని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి, శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్య నాయుడు రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్,వ్యవసాయ శాఖకు చెందిన హార్టికల్చరల్ పుష్పలత,ఉద్యావన వన శాఖ ఆదనపు సంచాలకులు ఎంకెవి శ్రీనివాసులు, డిడిహెచ్ జమదగ్ని తదితరులు పాల్గొన్నారు.

## పేరడైజ్ చిత్రాన్ని వీక్షించిన మోహన్‌బాబు



చంద్రగిరి, అక్టోబర్ 4 ప్రభాతవార్త: స్థానిక ఎస్వీ సినిమాస్‌లో సినీనటుడు, యంబి యు ఛాన్సలర్ పద్మశ్రీ మంచు మోహన్ బాబు ఆదివారం పేరడైజ్ చిత్రాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా థియేటర్ యజమాని మధు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ చిత్రంలో మోహన్‌బాబు విలన్‌గా తన నటనా చాతుర్యాన్ని అద్భుతంగా ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలు అందకున్నారు. చంద్రగిరిలో సినిమా చూడటానికి మోహన్‌బాబు వస్తున్నట్లు తెలుసుకున్న అభిమానులు, స్థానికులు థియేటర్ వద్దకు పెద్దఎత్తున చేరుకున్నారు. మోహన్‌బాబు యూనివర్శిటీ విద్యార్థులతో కలసి ఆయన చిత్రాన్ని వీక్షించారు.

## పనసకోన కాలువ...కనుమరుగయ్యేనా!



తొట్టంబేడు అక్టోబర్ 4 ప్రభాతవార్త: తొట్టంబేడు పంచాయతీలో ప్రభుత్వ భూములు, కాలువలు యథేచ్ఛగా కబ్జాకు గురవుతున్నా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా తొట్టంబేడు పంచాయతీ పరిధిలోని ఎల్ఐసి కాలనీ మీదుగా వెళుతున్న జీవనాడి లాంటి పనసకోన కాలువ పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితికి చేరింది. ఆక్రమించుకున్న వాళ్లకు ఆక్రమించుకున్నంత అన్న చందంగా కాలువ కబ్జా జరుగుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కబ్జాదారులు ఏకంగా కాలువ మధ్యలోనే బోర్లు వేసి, తమ సొంత భూమిగా మార్చుకుంటున్నారు. అనంతరం ట్రాక్టర్లతో మట్టిని తోలి కాలువను చదును చేసి పక్కా నిర్మాణాలకు పునాదులు వేస్తున్నారు. రెవెన్యూ రికార్డుల్లో కాలువగా ఉన్న భూమిని కూడా పట్టా భూమిగా చూపించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. పనసకోన కాలువ దశాబ్దాలుగా తొట్టంబేడు, చుట్టుపక్కల పొలాల నుంచి వచ్చే వర్షపు నీటిని తరలించే ప్రధాన మార్గం. ఈ కాలువను మూసివేయడం వల్ల గత రెండేళ్లుగా ఎల్ఐసి కాలనీ, ఈదులగుంట కాలనీలు చిన్నపాటి వర్షానికే చెరువులను తలపిస్తున్నాయి. ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భవిష్యత్తులో భారీ వర్షాలు వస్తే పెద్ద ముంపు ప్రమాదం తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ అక్రమ కబ్జాల వెనుక కొత్తగా వచ్చిన కొందరు రెవెన్యూ అధికారుల హస్తం ఉందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కబ్జాదారులకు అండగా నిలబడుతూ ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. తహాశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్, ఆర్డీవో స్థాయి అధికారులు వెంటనే జోక్యం చేసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. పనసకోన కాలువను పూర్తిస్థాయిలో రీ సర్వే చేయించి, సరిహద్దులు నిర్ణయించి ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు








కాణిపాకం, అక్టోబర్ 4 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్స వాలలో భాగంగా ఆదివారం భక్తుల కాలక్షేపం నిమిత్తం ఏర్పాటు చేసిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతో అలరించాయి.ఉత్సవాల చివరిరోజు తెప్పోత్సవం సందర్భంగా స్థానిక ఆస్థానమండపంలో ఉదయం నుండి అర్ధరాత్రి వరకు పలురకాల కార్యక్రమాలను నిర్వహించారు. రాష్ట్రంలోని ప్రఖ్యాత కళాకారులచే వైవిద్యభరితమైన సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈమేరకు భక్తిగీతాలు, కూచిపూడి, భరతనాట్యంలు, పౌరాణిక నాటక ప్రదర్శనలు, కోలాటాలు, చెక్కభజనలు వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా సురభి నాటక ప్రదర్శనలు ఆహుతులను అబ్బురపరిచాయి. కళాకారులకు దేవస్థానం తరపున జ్ఞాపికలను అందజేశారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## ప్రణాళిక బద్ధంగా మున్సిపల్ ఎన్నికల బందోబస్తు




సూళ్లూరుపేట, అక్టోబర్ 4 ప్రభాతవార్త: మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించి ప్రణాళిక బద్ధంగా శాంతి భద్రతలకు ఎటు వంటి విఘాతం కలగకుండా పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసేందుకు పోలీస్ శాఖ సన్నాహాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా ఆదివారం సీఐ ఎం మురళీకృష్ణ ఆధ్వర్యంలో పట్టణం లోని 32 వార్డులకు సంబంధించి 41 పోలింగ్ కేంద్రాలను సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐఎం మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు, నాయుడుపేట డిఎస్పిజి చెంచుబాబు పర్యవేక్షణలో మున్సిపల్ ఎన్నికలకు ముందస్తుగా శాంతి భద్రతల విషయమై ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని 41 పోలింగ్ కేంద్రాల్లో స్వేచ్ఛాయుత, ప్రజాస్వామ్యబద్ధంగా తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ప్రజలకుఅన్ని ఏర్పాట్లు చేయడం జరుగు తుందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రహరీ గోడలు, గదులు, ప్రవేశ మార్గాలను పరిశీలించామని తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పటిష్టమైన బందోబస్తుతో పాటు, నిరంతర నిఘా ఉ టుందని ఆయన తెలిపారు. అసాంఘిక కార్యక్రమా లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిఐ మురళీకృష్ణ హెచ్చరించారు. పోలీసులకు ప్రజలు తగిన సహకారం అందించి ఎన్నికల ప్రక్రియను సజావుగా జరిగేందుకు తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు గంట అజయ్ కుమార్, కొండప్ప నాయుడు, సుబ్రహ్మణ్య రాజు, భాను ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఇళ్లను తొలగించకండి!



సూళ్లూరుపేట, అక్టోబర్ 4 ప్రభాతవార్త: పట్టణంలోని మహదేవయ్య నగర్ తూర్పు వైపునున్న పేదల ఇళ్లను తొలగించ వద్దంటూ స్థానిక ఎమ్మెల్యేకి సిపిఎం నాయకులతో కలిసి ఆ ప్రాంత ప్రజలు ఆదివారం వినతి పత్రాన్ని అందజేశారు. 40 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో నివసిస్తున్నామని మున్సిపాలిటీకి కట్టవలసిన పన్నులు కడుతూ జీవనం సాగిస్తున్న తమను ప్రత్యామ్నాయం చూపకుండా మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేయడం అన్యాయమని వారు తెలిపారు. అలాగే ఈ ప్రాంతంలో ఉన్న సిపిఎం ఆఫీసును తొలగించడం వద్దంటూ సిపిఎం నాయకులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తాను స్వయంగా ఈ ప్రాంతాన్ని సందర్శించి అక్కడి ప్రజలతో మాట్లాడితగు చర్యలు చేపట్టడం జరుగుతుందని బాధితులకు ఆమె హామీ ఇచ్చారు.

## గ్రంథాలయాల అభివృద్ధికి ప్రణాళికలు

సూళ్లూరుపేట, అక్టోబర్ 4 ప్రభాతవార్త: జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేకంగా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ మెకపాటి శాంతి కుమారి అన్నారు. ఆదివారం ఆమె స్థానిక గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయంలోని రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. సూళ్లూరుపేట గ్రంథాలయంలో పాఠకుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా మరిన్ని ఆధునిక సౌకర్యాలు, అదనపు పుస్తకాలను అందుబాటులోకి తెచ్చేందుకు జిల్లా గ్రంథాలయ సంస్థ తరఫున సహకారం అందిస్తామని ఆమె తెలిపారు. అనంతరం గ్రంథాలయానికి వచ్చిన పాఠకులతో ముచ్చటించి గ్రంథాలయ అధికారుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎన్. శ్రీనివాసులు, వంకా జమున తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చెంగాళమ్మ సన్నిధిలో సినీ గాయని శైలజ



సూళ్లూరుపేట, అక్టోబర్ 4 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని శ్రీ చెంగాళ మాత పరమేశ్వరి దేవిని ప్రముఖ సినీ నేపథ్య గాయని ఎస్పీ శైలజ ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానానికి వచ్చిన ఆమెకు అసిస్టెంట్ కమిషనర్ బి. ప్రసన్నలక్ష్మి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజల అనంతరం ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ శైలజ అమ్మణ్ణిని స్తుతిస్తూ భక్తి పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అభివృద్ధి కమిటీ సభ్యులు పోలూరు బాల సుబ్రహ్మణ్యం, అలవల శ్రీనివాసులులు పాల్గొన్నారు.

## వివాహిత ఆత్మహత్య!

దొరవారిసత్రం, అక్టోబర్ 4 ప్రభాతవార్త: దొరవారిసత్రం మండలం కృష్ణాపు రానికి గ్రామానికి అంజిత్ భార్య తోట నాగేశ్వరి వయసు (21) సంవత్సరం ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరు లేని చూసి ఉయ్యాల హుక్ చున్నితో ఉరివేసుకొని మహిళ మృతి చెందినట్లు, ఈమెకు ఒక సంవత్సరం పాప ఉన్నట్లుగా స్థానికులు తెలిపారు. ఉరేసుకున్న కారణాలు తెలియాల్సి ఉంది. సదురు మండలం కుప్పారెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఇలుపూరి ఉమాపతి, ఆదివారం ఉదయం ఫ్యాను హుక్‌కు తాడు వేసుకొని ఉరేసుకొని మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు ఉమాపతికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు కుటుంబ కలహాలతో ఊరేసుకున్నట్లు స్థానికులు తెలిపారు.

## గణనాధునికి ఘనంగా గ్రామోత్సవం



కాణిపాకం, అక్టోబర్ 4 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరిగిన బ్రహ్మోత్స వాల చివరిరోజు ఆదివారం రాత్రి గణనాధునికి గ్రామోత్స వం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయంలో 21 రోజులు పాటు జరిగిన సా ్వమివారి వార్షిక బ్రహ్మోత్స వాలు ఆదివారం రాత్రి జరిగిన తెప్పోత్స వంతో ఘనంగా ముగిశాయి. తెప్పోత్స వం అనంతరం సా ్వమివారికి గ్రామోత్స వంను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈమేరకు తెప్పలపై విహరించి సేదతీరిన సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్స వమూర్తులకు తిరిగి గ్రామోత్స వంను నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిపై స్వామి అమ్మ వార్లను వుంచి మంగళవాయిద్యాలు, కోలాటాలు, చెక్క భజనలు వంటి వివిధరకాల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ కాణిపాకం గ్రామ పురవీధులలో ఘనంగా ఊరేగించారు. ఈసందర ్భంగా నారికేళ, కర్పూర హారతులతో స్వామివారికి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, ఉభయదారులు, వివిధప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కలసాకారం చేస్తాం

**- ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్**



కుప్పం, అక్టోబర్ 4 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం నియోజకవర్గంలో పేదల సొంతింటి కల సాకారం చేస్తామని ప్రభుత్వవిప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ పరిధిలో అర్హులైన 189మంది పేదలకు పక్కా ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. నియోజకవర్గంలో అర్హులైన పేదలకు త్వరలోనే పెద్ద ఎత్తున పక్కా ఇళ్లు మంజూరుకానున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి పిఎంఎవై2.0కింద 3లక్షల ఇళ్లు మంజూరు చేసిందన్నారు. పిఎంఎవై, ఎన్టీఆర్ హౌసింగ్ పథకం ద్వారా అర్హులకు ప్రభుత్వం పక్కా ఇళ్ల నిర్మాణంకు 2.45లక్షల మేర నగదు సైతం చెల్లిస్తుందన్నారు. పేదరికమే ప్రభుత్వ పథకాల అర్హతకు కొలబద్ధగా తీసుకుంటామన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులకు సంక్షేమ పథకాల్లో లబ్ధి కలిగించడమే సిఎం చంద్రబాబు నాయుడు ధ్యేయం అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్,సిఎం పిఎ శ్రీకాంత్, కమీషనర్ శ్రీనివాసరావు, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శా ంతారాం, మున్సిపల్ మాజీ ఛైర్మన్ డాక్టర్ సుధీర్, ఏరియా ఆస్పత్రి వైస్‌ఛైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్, కౌన్సిలర్లు జిమ్‌దాము, సోమశేఖర్, జాకీర్, ఎంఆర్ సురేష్, టౌన్‌బ్యాంక్ ఛైర్మన్ మంజునాథ్,క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, పార్టీ విస్తరణ కమిటీ సభ్యుడు మంజునాథ్‌తో పాటు స్థానిక నేతలు, లబ్దిదారులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## శివయ్య సేవలో హైకోర్టు న్యాయమూర్తి



శ్రీకాళహస్తి,అ క్టోబర్ 4 ప్రభాతవార్త

వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు.వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ఆలయ ఇఒ బికె వెంకటేశులు ఆదేశాలతో ఎఇఒ లోకేష్‌బాబు, ఎపిఆర్ఒ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు.ఆలయంలో నిర్వహించే మహిమాన్విత పూజలను జరిపించుకున్న ఆమెకు స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు.మృత్యుంజయస్వామి ఆలయం దద్ద వారికి ఆలయ వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలందించారు.స్వామి అమ్మవార్ల చిత్రపటాలను, తీర్థ ప్రసాదాలను ఇఒ వెంకటేశులు అందించారు. ఏర్పాట్లను ఏఇఒ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్,వెంకటస్వామి, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్‌లు పర్యవేక్షించారు.

## చినుకుకోసం చింత: వరుణుని కరుణకోసం యాగం



శ్రీకాళహస్తి,అక్టోబర్ 4 ప్రభాతవార్త

ఆగస్టు నుంచి కురవాల్సిన వాన కురవక పోవటం ఎండలు దడపుట్టిస్తుండటం, భూగర్భ జలాలు అడుగంటి పోవటం వ్యవసాయం ఎత్తుభారంగా మారటంతో పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తిలో వరుణయాగాలు దేవాదాయశాఖ ఆదేశాలతో వరుణ స్వరయాగాన్ని చేపట్టారు. ఆలయంలోని కోట మండపం ఎదురుగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక వేదికపై ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దేవుళ్ళను సంతప్తి పరచుట ఆకట్టుకొనుట ఓ ప్రక్రియ అనాది కాలం నుంచి వస్తుంది.ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావంతో తల్లడిల్లుతున్నారు. ఈ నేపథ్యంలో దేవాదాయశాఖ ఆదేశాలతో ఐదురోజుల పాటు ప్రత్యేక సంగీత కార్యక్రమాలతో వరుణుని ఆకట్టుకొనుటకు ఓ చిన్ని ప్రయత్నం గా చేపట్టారు.ప్రతిరోజూ ఉదయం సాయంత్రం ఆలయ విద్వాంసులు వర్షాధారిత భావాలను అనుసంధానమైన అమృత వర్షిణి, మధ్యమావతి, వరుణ ప్రియ, సముద్రప్రియ,అనందభైరవి రాగాలతో కూడిన స్వరాలను ఆలపిస్తున్నారు.

## నాదేండ్లకు శివయ్య ప్రసాదాలు



శ్రీకాళహస్తి,అక్టోబర్ 4 ప్రభాతవార్త

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, జనసేన పార్టీ నేత నాదేండ్ల మనోహర్‌ను రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు శ్రీకాళహస్తి బిజెపి ఇన్‌చార్జి కోలా ఆనంద్ మర్యాదపూర్వకంగా కలసినారు. ఆయనకు శ్రీకాళహస్తీశ్వరుని తీర్థ ప్రసాదాలను అందించారు.అలాగే శ్రీకాళహస్తీశ్వరుని దుశ్శాలువతో సత్కరించారు.తన వ్యక్తిగత పని మీద నాదేండ్ల మనోహర్‌ను తన సొంత నియోజకవర్గంలో కలసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సమన్వయంతో పని చేసి అన్ని స్థానాలను గెల్చుకోవాలని చర్చించినట్లు సమాచారం.

## ఆర్యవైశ్య విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు




శ్రీకాళహస్తి,అక్టోబర్ 4 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలో ప్రతిభా పాటవాలు కల్గిన ఆర్యవైశ్య విద్యార్థులను ప్రోత్సహించుటకు,ఆర్థికంగా ఆదుకొనుటకు స్కాలర్ షిప్‌లను అందించారు. ఆదివారం బజారువీధిలోని శ్రీకాళహస్తి వాసవి నిత్యాన్న అన్న సంతర్పణ సంస్థచే ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.వంకాయల కుప్పయ్యశెట్టి సత్రం సారధ్యంలో విద్యార్థులకు ఇంటర్,డిగ్రీ విద్యార్థులకు విద్యాదానం పథకంలో స్కాలర్ షిప్‌లు మంజూరు చేసారు. ఫౌండర్ మద్దాలి శ్రీనివాసులు,ట్రస్టీలు కుమారస్వామి,మహేంద్ర కుమార్,సారధ్యంలో ముఖ్యఅతిథిగా చెన్నై కు చెందిన షణ్ముగం శ్రీనివాసులు హాజరయ్యారు. 20మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి ఐదు చొప్పున ఐదుమందికి రూ.10వేల చోప్పున అందించారు. గతంలో ఈ సంస్థ అన్నదానం నిర్వహించే వారు. ఈ ఏడాది నుంచి విద్యాదానం కూడా ప్రారంభించినట్లు షణ్ముగం శ్రీనివాసులు వివరించారు.సమాజాంలో ఆర్యవైశ్యులు వ్యాపార పరంగా రాణించారు కానీ ఆర్థికంగా పలువురు నిలదొక్కులేక పిల్లలను చదివించుకోలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమాల్లో తన్నీరు రామమోహన్‌రావు జూలుగంటి మురళి,పురుషోత్తం,ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

## బోరు మోటారు బిగించిన అధికారులు

### వార్త ప్రభావం



శాంతిపురం, అక్టోబర్ 4 ప్రభాతవార్త

మండల కేంద్రమైన శాంతిపురంలో తాగునీటి బోరుకు అధికారులు మోటారు మిగించారు. మండల కేంద్రంలో మంచినీటి కటకట అనే వార్త వెలువడిన విషయం విదితమే. దీనిపై అధికారులు, నాయకులు స్పందించి ఆదివారం ఉదయం బోరు మోటారు బిగించారు. దీంతో మండల కేంద్ర ప్రజలు 'వార్త'కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఒక్క సమాచారం.. ఒక జీవితాన్ని కాపాడొచ్చు

### మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

తిరుపతి విద్య,అక్టోబరు 4 ప్రభాతవార్త:



మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండటమే కాకుండా.. వాటి వినియోగం, అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారాన్ని అధికారులకు చేరవేసి సమాజ రక్షణలో భాగస్వాములు కావాలని వక్తలు పిలుపునిచ్చారు. యువత అందించే ఒక్క సమాచారం ఒక వ్యక్తి జీవితాన్ని, ఒక కుటుంబాన్ని కాపాడే అవకాశం ఉందన్నారు. మై భారత్, ఆంధ్రప్రదేశ్, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్-రాష్ట్రీయ సంకల్ప్ సమారోహ్ లో భాగంగా తిరుపతి యూత్ హాస్టల్ నుంచి అవగాహన హెల్త్ వాక్ నిర్వహించారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తుతో పాటు కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. యువత ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన జీవన విధానాన్ని అలవర్చుకుని వికసిత్ భారత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారాన్ని జాతీయ మాదకద్రవ్య విముక్తి హెల్ప్‌లైన్ 14446, ఈగల్ టోల్‌ఫ్రీ 1972కు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.తొలుత ఎమరాల్డ్ కాలేజ్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ముఖ్య అతిథులు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. యువత నషా ముక్త్ భారత్-వికసిత్ భారత్,మాదకద్రవ్యాలకు నో చెప్పండి-జీవితానికి యెస్ చెప్పండి అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. యూత్ హాస్టల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ఆల్ ఇండియా రేడియో, ఎం.ఆర్. పల్లి సర్కిల్ మీదుగా తిరిగి యూత్ హాస్టల్‌కు చేరుకుంది.కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు జి. భానుప్రకాష్ రెడ్డి, మై భారత్ స్టేట్ డైరెక్టర్ కె. వెంకట్ ఉజ్వల్, జిల్లా యువజన అధికారిణి ఎల్. సంకీర్తన చవాన్, ప్రోగ్రాం సూపర్‌వైజర్ జి. శ్రీనివాసులు, ఎన్‌డీఆర్‌ఎఫ్ కమాండర్, ఈగల్ సెల్ సీఐ, మై భారత్, ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌ఆర్‌డీజీ, ఎమరాల్డ్ కాలేజ్ ప్రతినిధులు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## మారుతున్న జర్నలిజానికి.. నైపుణ్యమే ఆయుధం

### వేగం కంటే వార్తలో ఖచ్చితత్వమే ముఖ్యం

### తిరుపతిలో గ్రామీణ విలేఖరుల పునశ్చరణ తరగతులు ముగింపు

తిరుపతి విద్య, అక్టోబరు 4 ప్రభాతవార్త:



జర్నలిజంలో వస్తున్న సాంకేతిక, సామాజిక మార్పులకు అనుగుణంగా గ్రామీ ణ జర్నలిస్టులు తమ వృత్తిపరమైన నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగు పర్చుకోవాలని పూతలపట్టు ఎమ్మెల్యే కె. మురళీమోహన్ సూచించారు. సీఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించిన జిల్లా గ్రామీణ విలేఖరుల రెండు రోజుల పునశ్చరణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.తాను జర్నలిస్టుగా పనిచేసిన రోజులను గుర్తుచేసుకున్న మురళీమోహన్.. ప్రస్తుత పరిస్థితుల్లో జర్నలిజంలో వస్తున్న మార్పులను స్వీకరించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు సీఆర్ మీడియా అకాడమీ చేస్తున్న కృషిని అభినందించారు. శిక్షణలో పాల్గొన్న జర్నలిస్టులకు సర్టిఫికెట్లు, మీడియా అకాడమీ ప్రచురించిన పుస్తకాలను అందజేశారు.సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్‌కుమార్ మాట్లాడుతూ వార్త ప్రాధాన్యతకు ప్రధాన గీటురాయి ప్రజా ప్రయోజనమేనన్నారు. ఒక వార్త వల్ల ప్రజలకు ఎంత ప్రయోజనం కలుగుతుందనేది జర్నలిస్టు చిత్తశుద్ధిపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. సోషల్ మీడియా విస్తరణతో వాస్తవ, అవాస్తవ సమాచారాల మధ్య రేఖ చెరిగిపోతున్న నేపథ్యంలో ఏ సమాచారాన్నైనా ధృవీకరించుకున్న తర్వాతే ఇతరులకు చేరవేయాలని సూచించారు.పునశ్చరణ తరగతుల్లో సీనియర్ జర్నలిస్టులు వివిధ అంశాలపై గ్రామీణ విలేఖరులకు అవగాహన కల్పించారు. వార్తల్లో సరళమైన భాషను ఉపయోగించడం ద్వారా పాఠకులకు మరింత చేరువ కావచ్చని సీనియర్ జర్నలిస్టు, రచయిత ఎ. రాఘవశర్మ తెలిపారు. ప్రాంతీయ మాండలికాలను సందర్భానుసారంగా, ఔచిత్యంతో ఉపయోగించాలని సూచించారు. వార్తల్లో భాషా సౌందర్యం కంటే సౌలభ్యానికే ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.క్రైమ్ రిపోర్టింగ్‌లో వేగం కంటే ఖచ్చితత్వం ముఖ్యమని జర్నలిస్టు శ్రీశైలం రమేష్ పేర్కొన్నారు. ప్రతి ప్రాంతంలో విశ్వసనీయమైన సమాచార వనరులను ఏర్పాటు చేసుకోవాలని, ఎఫ్ఐఆర్ నుంచి ఛార్జ్‌షీట్, కోర్టు కేసుల వరకు వార్తలపై నిరంతరం ఫాలోఅప్ కొనసాగించాలని సూచించారు. సైబర్ మోసాల్లో డబ్బు పోగొట్టుకున్న వెంటనే 1930కు ఫోన్ చేస్తే రికవరీకి అవకాశాలు ఉంటాయని తెలిపారు.ఫ్యాక్ట్‌చెక్‌పై జర్నలిస్టు నరేష్ నందం అవగాహన కల్పించారు. .సీనియర్ జర్నలిస్టు, ఐజేయూ సెక్రటరీ జనరల్ డి. సోమసుందర్ గ్రామీణ వార్తలు, కథనాలపై ప్రసంగిస్తూ గ్రామ, మండల స్థాయిలో వార్తల సేకరణకు ఉన్న అవకాశాలను వివరించారు. స్థానిక పాలన, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రణాళికలు, బడ్జెట్ తదితర అంశాలపై ప్రజా ప్రయోజన కోణంలో కథనాలు రూపొందించవచ్చన్నారు.

## ఆదర్శ పాఠశాలలో ట్రైజర్ హంట్ పోటీ పరీక్ష

కేవీబీపురం, అక్టోబరు 4 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని స్థానిక ఆదర్శ పాఠశాలలో(జీరో ఆఫ్ ఇండియన్ స్టాండర్) ట్రెజర్ హంట్ అనే పోటీ పరీక్షను ప్రిన్సిపాల్ సౌజన్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.1500, రెండో బహుమతిగా రూ.వెయ్యి, మూడవ బహుమతిగా రూ.750, నాలుగో బహుమతిగా రూ.250లు విద్యార్థులకు అందజేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

## పాత పల్లూరు గ్రామంలో ఆపరేషన్ త్రిశూల్ కార్యక్రమం

పుత్తూరురూరల్, అక్టోబరు 4 ప్రభాతవార్త:



పుత్తూరు ఎస్‌డీపీవో ఆధ్వర్యంలో ఆదివారం పుత్తూరు మండలం పాత పల్లూరు గ్రామంలో ఆపరేషన్ త్రిశూల్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పుత్తూరు పట్టణంలోని 1వ వార్డును కూడా సందర్శించి స్థానిక పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌డీపీవో, సీఐ, ఎస్ఐ పుత్తూరు అర్బన్ పోలీస్‌స్టేషన్ సిబ్బందితో కలసి గ్రామ ప్రజలను ఉద్దేశించి మహిళల భద్రత, మాధక ద్రవ్యాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలపై అప్రమత్తత, శాంతిభద్రతల పరిరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా ఎటువంటి అవాంచనీయ సంఘటనలకు తావు లేకుండా నిర్వహించేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు. సమస్యలు గుర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

## గోదాముల నిర్మాణానికి ప్రత్యేక నిధులివ్వండి

### కేంద్ర మంత్రికి వినతి



శ్రీకాళహస్తి, అక్టోబర్ 4 ప్రభాతవార్త

తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి నియోజకవర్గం ధాన్యాగారంగా వ్యవసాయానికి ప్రధాన కేంద్రంగా విరాలజిల్లుతుందని ఇక్కడి రైతుల సౌకర్యార్థం గోదాముల నిర్మాణానికి ప్రత్యేక నిధులివ్వాలని శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు వినతి పత్రం అందించారు. ఆదివారం కేంద్ర సహాయ వ్యవసాయశాఖ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్,కేంద్ర ఉద్యానవన శాఖ కమిషనర్ ప్రభాత్ కుమార్‌లు శ్రీకాళహస్తి పర్యటనకు వచ్చారు. వారికి ఆలయ వద్ద ఘన స్వాగతం పలికారు.స్వామి అమ్మవార్లను దర్శించుకున్న కేంద్ర మంత్రికి మార్కెటింగ్ కమిటి చైర్మెన్ చెంచయ్యనాయుడు వినతి పత్రం అందిస్తూ శ్రీకాళహస్తి వ్యవసాయశాఖ సబ్ డివిజన్ పరిధిలో సుమారు 450కి పైగా చెరువులున్నాయని, వాటి కింద రబీ,ఖరీఫ్ సీజన్లలో విడివిడిగా 32వేల హెక్టార్లలో ఒక్కొక్క సీజన్‌లో పంటలు పండిస్తున్నారన్నారు. రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకోవటానికి ప్రభుత్వ గోదాములేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటికి 11 ఎకరాల స్థలం ఉందని ఇక్కడ ప్రత్యేక గోదాములు రైతుల కోసం నిర్మించి వారికి నిల్వచేసుకునే సొమ్ములకు ఆర్థిక సహాయం చేస్తే గిట్టుబాటు ధరలు వచ్చే వరకు నిల్వ చేసుకుంటారని వివరించారు.అలాగే ఇక్కడ ఇంకా సంప్రదాయ వ్యవసాయం చేస్తున్నారని సాంకేతిక పరిజ్ఞానొ పెరుగుతున్న తరుణంలో ఇంకా సంప్రదాయ వ్యవసాయంతో కూలీలు దొరకకుండా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి దృష్టికి తెస్తూ వ్యవసాయ పరికరాలు త్వరిత గతిన మంజూరు చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని విన్నవించారు. స్పందించిన మంత్రి ప్రతిపాదనలను వెంటనే పంపాలని వ్యవసాయశాఖాధికారులను వివరించారు. చెంచయ్యనాయుడుతో పాటు రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్,జిల్లా నాయకుడు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి,హరి,జివి అమర్‌నాథ్,వెంకటరమణానాయుడు,వ్యవసాయాధికారులు తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

## బియ్యపు మధుసూదన్ రెడ్డి సంతాపం

రేణిగుంట, అక్టోబర్ 4, ప్రభాతవార్త:



రేణిగుంట మండలం కోట్రమంగళం గ్రామానికి చెందిన కేశవరెడ్డి తల్లి మునెమ్మ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. ఆమె మృతిపట్ల మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం నిర్వహించిన మునెమ్మ కర్మక్రియలకు ఆయన హాజరై, మునెమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం మునెమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించిన బియ్యపు మధుసూదన్ రెడ్డి, వారి కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆప్తుడిని కోల్పోవడం ఎంతో బాధాకరమని అన్నారు. కర్మక్రియల్లో పలువురు గ్రామస్తులు, స్థానిక నాయకులు పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో తిరుపాల్ రెడ్డి,సీపీ రాజశేఖర్ రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, భాను ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

## ముక్కోటి ఉత్సవాలలో భక్తులకు రక్షణ కల్పించండి.

### బిజెపి నాయకుడు నవీన్‌కుమార్ రెడ్డి

చంద్రగిరి, అక్టోబర్ 4 ప్రభాతవార్త:



ముక్కోటి ఉత్సవాలలో భక్తులకు రక్షణ కల్పించడంలో పోలీసు సేవలను కల్పించాలని కోరుతూ ఆదివారం బిజెపి నాయకుడు నవీన్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మొగిలి సంజయ్‌కుమార్ రెడ్డి, దినకర్ రెడ్డి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడుకు వినతి పత్రం అందజేశారు. తొండవాడ స్వర్ణముఖీ నదీతీరాన వెలసియున్న శ్రీ అగస్త్యేశ్వర స్వామి వారి ఆలయ ధర్మకర్త మొగిలి ఇందుమౌళి రెడ్డి ప్రతినిధులుగా వీరు జిల్లా ఎస్పీని కలిశారు. ఈ నెల 24 నుండి 26 వరకు ఆలయంలో రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు వివిధ రాష్ట్రాలు, జిల్లాలు, ప్రాంతాల నుండి రోజుకు సగటున 50 వేల మందికి పైగా భక్తులు హాజరు అవుతారని ఎస్పీకి వివరించారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు, రక్షణ పరమైన ఇబ్బందులు తలెత్తకుండా తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. ముక్కోటి ఉత్సవాలపై సానుకూలంగా స్పందించిన ఎస్పీ ఆమేరకు పోలీసు శాఖ తరపున తగిన ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎస్పీకి పుష్పగుచ్ఛం, ఆలయ డైరీని అందజేసి దుశ్శాలువతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

## వినాయక స్వామి వారికి ఎంఎల్ఏ పట్టువస్త్రసాలు

చంద్రగిరి, అక్టోబర్ 4 ప్రభాతవార్త:



స్థానిక కొత్తపేట, చాకలివీధిలో వెలసియున్న శ్రీ వినాయక స్వామి వారికి ఆదివారం ఎంఎల్ఏ పులివర్తి నాని పట్టువస్త్రాలు సమర్పించారు. ఇందులో భాగంగా చంద్రగిరి టవర్‌క్లాక్ నుండి ఊరేగింపుగా మేళతాళాలు, బ్యాండుభాజాలు, భాణాసంఛాపేళుళ్ళ నడుమ ఎంఎల్ఏ పట్టువస్త్రాలను మోసుకుని ఆలయానికి చేరుకున్నారు. అర్చకుల వేదమంత్రోచ్ఛారణల నడుమ ఆలయ నిర్వాహకులు, పూర్ణకుంభ స్వాగతం పలికి పట్టువస్త్రాలను స్వీకరి ంచారు. అనంతరం స్వామి వారికి ప్రత్యే పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఎస్టీ కాలనీ వాసులకు

### నిత్యావసర సరకుల పంపిణీ చేసిన ఏఎంసీ చైర్మన్

నాగలాపురం, అక్టోబరు 4 ప్రభాతవార్త:



నాగలాపురం మండలం కొట్టకాడు గ్రామంలోని యానాది సెంటర్ ప్రాంతంలోనివసిస్తున్న పేద, సామాన్య ప్రజలకు ఆదివారం సాయంత్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) అధ్యక్షులతరపున నిత్యావసర సరకులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బియ్యం, పప్పులు, వంట నూనె,మిరప పొడి, సబ్బులు, పళ్ళపొడి తదితర నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పేద, సామాన్య ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగాపని చేస్తోందని, పేదల అభ్యున్నతికి ముఖ్యమంత్రి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్నారని వివరించారు. పేద, సామాన్య ప్రజల అవసరాలను గుర్తించి వారికి సహాయహస్తం అందించడం నిజమైన మానవత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజలకు అండగా నిలిచే కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు గోవిందన్, ఆదికేశవన్, జయపాల్, నాగేష్, ఫ్రాన్సిస్, ట్రైసన్, ఐన్‌స్టీన్, ఎడిసన్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సీఎం సహాయక నిధి అండ - ఎమ్మెల్యే

నాగలాపురం, అక్టోబరు 4 ప్రభాతవార్త:



నాగలాపురం మండల కేంద్రంలోని గాంధీవీధికి చెందిన వడ్ల పద్మావతమ్మకు ముఖ్యమంత్రిసహాయనిధి (సీఎం ఆర్ఎఫ్) రూ.42,746 చెక్కును సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే ఆదిమూలం చేతుల మీదుగా అందజేశారు. పిచ్చాటూరు మండలంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఈ చెక్కును వడ్ల పద్మావతి అమ్మకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో పేద ప్రజలకు అన్ని విధాలుగాఅండగా నిలుస్తున్నారని తెలిపారు. ఆపదలో ఉన్న నిరుపేదలకు సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తూ వారికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఈ స్థాయిలో సీఎం సహాయనిధి అందలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాగలాపురం ఎంపీటీసీప్రేమ సెల్వకుమార్, మాజీ ఎంపీపీ పి.మురళి, నాగలాపురం మండల నాయకులు ఆర్.భాస్కర్‌శెట్టి, షణ్ముగంఆచారి, ఎస్.ఎం.సురేష్, రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యమే మహాభాగ్యం : డాక్టర్ సుధారాణి

పుత్తూరు రూరల్, అక్టోబర్ 4 ప్రభాతవార్త:



శ్రీ సాయి సుధా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో కార్వేటి నగరం మండలం డియం పురం స్కూల్ దగ్గర ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 100 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు, ఎముకల పరీక్షలు నిర్వహించి సలహాలు సూచనలు ఇచ్చారు. అవసరమైన వారికీ ఉచితంగా మందులు పంపిణి చేసారు. డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా 10 మందిని ఉచితంగా ఆపరేషన్ నిమిత్తం హాస్పిటల్‌కు రెఫర్ చేశామన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ కార్డు ద్వారా ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామని తెలియజేసారు.ఈ వైద్య శిబిరంలో శ్రీరంజిని, డాక్టర్ కుమార్, విశ్వనాథ్, గౌతమ్, మహేష్, క్యాంపు ఆర్గనైజర్ మునిశంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## చిత్రలేఖనం రాష్ట్ర స్థాయి పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థి తనుశ్రీ

కేవీబీపురం, అక్టోబరు 4 ప్రభాతవార్త:

చిత్రలేఖనం రాష్ట్ర స్థాయి పోటీలకు మండల కేంద్రంలోని స్థానిక ఆదర్శ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న తనుశ్రీ ఎంపికైంది. సేవాసంకల్ప అభియాన్ భాగంగా నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైందని ప్రిన్సిపాల్ సౌజన్య తెలిపారు.

5CTR 6:5CTR 6.qxd 10/4/2026 10:42 PM Page 1



# పాలకులు మారినా మారని ఈదులగుంట తలరాత..

తొట్టంబేడు అక్టోబర్ 4 ప్రభాతవార్త

ఓట్ల పండుగ వచ్చిందంటే తొట్టంబేడు పంచాయతీలోని ఈదులగుంట కాలనీ బాట పట్టే నాయకులకు కొదవ ఉండదు. "మీకు ఇళ్ల పట్టాలు ఇప్పిస్తాం, సిమెంట్ రోడ్లు వేస్తాం, డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం" అంటూ అర చేతిలో స్వర్గం చూపిస్తారు. చేతిలో చేయి వేసి హామీలు గుప్పిస్తారు. కానీ ఎన్నికలు ముగియగానే ఆ హామీలన్నీ గాలికి కొట్టుకుపోతాయి. ఇలా నాయకుల మాటలు నమ్మి మోసపోయి మూడు దశాబ్దాలు గడిచిపోయినా తమ బతుకులు మాత్రం మారలేదని 150 కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.



ఈదులకుంట కాలనీ లో రోడ్డు దుస్థితి

**30 ఏళ్లుగా పట్టాలు లేవు. ఆదుకునే దిక్కూ లేదు:**

నాడు గోపాలకృష్ణారెడ్డి హాయాం నుంచి ఈ కాలనీ వాసుల అవస్థలు ఆందోళనలకే పరిమితమౌతుంది. కరెండటు ఇచ్చారు. రోడ్డు వేసారు. పట్టాలివ్వమంటే అధికారులు నీళ్ళు నములుతున్నారని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు ముప్పై ఏళ్లుగా ఒకే చోట నివాసం ఉంటున్నా కాలనీ వాసులకు నేటికీ నివాస స్థలాలకు సంబంధించిన ఇంటి పట్టాలు లేవు. దశాబ్దాలుగా అదే ఇంట్లో ఉంటున్నా తమకు సొంత చిరునామా లేదని కన్నీరు పెడుతున్నారు. పట్టాలు లేకపోవడంతో ఇంటి పన్నులు కట్టించుకునే పరిస్థితి కూడా లేదు. దీంతో ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నా తమకు అర్హత లేకుండా పోతోందని వాపోతున్నారు. ప్రతి అధికారి, నాయకుడు వచ్చినప్పుడు మాదే బాధ్యత అని చెబుతున్నారే తప్ప క్షేత్రస్థాయిలో ఇచ్చింది శూన్యమని వాపోతున్నారు.

**2006 నాటి రోడ్డే దిక్కు.. బురదలోనే బతుకులు:..**

2006లో అప్పటి ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు హయాంలో డిగ్రీ కాలేజీ నుంచి ఎల్ఐసి కాలనీ మీదుగా వేసిన తారు రోడ్డే ఈ ప్రాంతానికి నేటికీ దిక్కయిందని కాలనీ వాసులుచెబుతున్నారు. దాని తరువాత నేటి వరకు ఒక్క సీసీ రోడ్డు గానీ, బీటీ రోడ్డు గానీ నిర్మించిన దాఖలాలు లేవు. వర్షం వస్తే చాలు మట్టి రోడ్లన్నీ బురదమయంగా మారి మోకాళ్ల లోతు బురదలోనే నడవాల్సి వస్తోంది. వీధుల ఇరువైపులా చెట్లు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో విషసర్పాలు, తేళ్లు, క్రిమికీటకాల తో పిల్లలను బయటకు పంపాలంటేనే భయమేస్తోందని ప్రజలు వాపోతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్ల మురుగునీరు రోడ్లపైకే చేరి దుర్గంధం వెదజల్లుతోంది.

**పేరుకే పంచాయతీ.. పారిశుధ్యం పడకేసింది:.**

ఈదులగుంట కాలనీ పేరుకే తొట్టంబేడు పంచాయతీ పరిధిలో ఉందే తప్ప పారిశుధ్య నిర్వహణ లవలేశమైనా లేదని స్థానికులు మండిపడుతున్నారు. కాలనీలో రోడ్లు ఊడ్చే సిబ్బంది లేక వీధుల్లో చెత్తకుప్పలు పెరిగిపోయి మురిగిపోతున్నాయి. కనీసం దోమల వ్యాప్తిని నివారించేందుకు బ్లీచింగ్ పౌడర్ చల్లిన దాఖలాలు కూడా ఏనాడూ లేవని, దీంతో సీజనల్ వ్యాధులతో పిల్లలు, వృద్ధులు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన చెందుతున్నారు. అధికారం చేపట్టి రెండున్నరేళ్లు దాటుతున్నా స్థానిక ఎమ్మెల్యే కానీ, పంచాయతీ అధికారులు కానీ తమ కాలనీ వైపు కనీసం కంటిచూపైనా చూడలేదని స్థానికులు తీవ్రంగా వాపోతున్నారు. పాలకులు, ప్రభుత్వాలు మారినా తమ తలరాత మాత్రం మారడం లేదని, ఇకనైనా అధికారులు నిద్రమత్తు వదిలి కాలనీలో పర్యటించి తక్షణమే ఇళ్ల పట్టాలు మంజూరు చేయడంతో పాటు సీసీ రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్య సమస్యలను తీర్చాలని డిమాండ్ చేస్తున్నారు.

# తిరుపతి డివిజన్

## పవన్ కళ్యాణ్ ఆశయాలకు ఆకర్షితులై జనసేనలో చేరికలు



శ్రీకాళహస్తి, అక్టోబర్ 4 ప్రభాతవార్త:..

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలకు ఆకర్షితులై శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సుమారు 30 మంది గిరిజన మహిళలు జనసేన పార్టీలో చేరారు. చందమామల కోటయ్య ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారిని జనసేన జిల్లా కార్యదర్శి, శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొట్టే సాయి ప్రసాద్ మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం పట్ల పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నారని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, రహదారులు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని, వారి సమస్యల పరిష్కారానికి జనసేన నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. జనసేన నాయకులు జయప్రకాష్ మాట్లాడుతూ అరకు వంటి గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల సమస్యలపై పవన్ కళ్యాణ్ చూపిన దృష్టి ఆయనకు గిరిజనులపై ఉన్న ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనమని అన్నారు. రహదారి లేని ప్రాంతాల్లో వైద్యం కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి వాటి అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని పవన్ కళ్యాణ్ నిరంతరం సూచిస్తున్నారని తెలిపారు. నాయకులు విజయ్ కుమార్ మాట్లాడుతూ పార్టీపై నమ్మకంతో చేరిన ప్రతి ఒక్కరికీ స్వాగతం పలుకుతున్నామని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు స్థానిక సమస్యలను పార్టీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పార్టీలో ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమార్, మహేష్, పసుపులేటి నవీన్, ఢిల్లీ బాబు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## ఉరందూరులో ఎల్లమ్మ పొంగల్‌లో మాజీ ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి రూరల్, అక్టోబర్ 04 ప్రభాతవార్త:



మండలంలోని ఉరందూర్ గ్రామంలో ఎల్లమ్మ తల్లి పొంగల్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పొంగల్ సమర్పించి గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పంటలు బాగా పండాలని ప్రార్థించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విజయ భాస్కర్ రెడ్డి, దిలీప్, నవీన్, సాయి, శివ, హరీష్, పవన్, కోటి, బాలిరెడ్డి, మనోహర్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, భాను ప్రకాష్ రెడ్డి, సురా సురేష్, మణి, అస్లాం, కేశవ, రాజేష్, వంశీ తదితర నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సాయి సత్సంగమనం

శ్రీకాళహస్తి, అక్టోబర్ 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని శ్రీరామనగర్ కాలనీలో వెలసిన సాయి బాబా ఆలయంలో ఆదివారం సాయి భక్తులు సత్సంగమం నిర్వహించారు. ఉదయం నుంచి బాబా సన్నిధిలో భజనలు, ఆరాధనలతో పునతమైంది. కాలనీ దద్దరిల్లేట ట్లు బాబా నామస్మరణతో చక్కటి పాటలతో గడిపారు. బాబా సమాజానికి అందించిన సేవలను ఉటకిస్తూ కీర్తనలను ఆలపించారు. సాయంత్రం భక్తులు సాయినామస్మరణతో కీర్తనలు ఆలపిస్తూ బాబా చిత్రపటాన్ని పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవం శ్రీరామ్‌నగర్ కాలనీ నుంచి నెహ్రూవీధి, నగరివీధి, బజారు వీధి, తేరువీధుల మీదుగా సాగింది. వేలవేదు వేణు సారధ్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు వితరణ చేస్తూ ముందుకు సాగారు.

## ఎన్నికల పోలింగ్ కేంద్రాలపై పోలీసుల ప్రత్యేక దృష్టి

రేణిగుంట, అక్టోబర్ 4, ప్రభాతవార్త:



పంచాయతీ, ఎంపీటీసీ తదితర స్థానిక ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు, రేణిగుంట డీఎస్పీ వై. శ్రీనివాసరావు పర్యవేక్షణలో రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక, సాధారణ పోలింగ్ కేంద్రాలను పోలీసులు ఆదివారం పరిశీలించారు. రేణిగుంట సీఐ ఎస్. జయచంద్ర పోలీసు సిబ్బందితో కలిసి ఆయా కేంద్రాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లు, విద్యుత్, లైటింగ్, తాగునీరు, ఓటర్ల రాకపోకల మార్గాలు, ఇతర మౌలిక వసతులను పరిశీలించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు భద్రతా చర్యలను పటిష్ఠం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించిందని, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఆయన యవ్వారంతో ఉన్న పరువుపోయే!

### -కూటమికి దక్కని ఎస్ఎంసి చైర్మన్ పదవి

### -ఆగ్రహం వెలిబుస్తున్న టిడిపి నేతలు

గంగవరం, అక్టోబర్ 4 ప్రభాతవార్త :



నూతన విద్యాకమిటీని అభినందిస్తున్న స్థానిక వైసీపీ నాయకులు

నియోజకవర్గంలో ఆయనో సీతయ్యలా ఎవరి మాట వినని నేతగా ఇప్పటికే విమర్శలు వినిపిస్తున్నా తాజా ఎస్ఎంసి చైర్మన్ ఎన్నికల్లోనూ ఆయన వైసిపికి మద్దతివ్వడంపై కూటమి శ్రేణులు విరుచుకుపడుతున్నాయి. ఆయన తీరుపై ఇప్పటికే కూటమి పార్టీల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా టిడిపికి నష్టం కలిగించేలా వ్యవహరిస్తుండటం మాత్రం అధికార పార్టీ ఎమ్మెల్యే కూడా పట్టించుకోక పోవడంపై జనం అసహనం చెందుతున్నారు. గత కొంతకాలంగా ఆయన వాలకంపై ప్రజలు చర్చ సాగిస్తున్నారు. ఇదీ ఏఎంసి ఛైర్మన్ నిర్వాకంగా మారింది. ఆయనకు ఆ పదవి కట్టబెట్టినప్పటి నుండి నియోజకవర్గంలో కూటమి పార్టీల నేతల్లో అసంతృప్తి రగులుతోంది. ఆయినా ఆయన మాటతీరు, పనితీరు మార్చుకోలేక పోవడమేగాక ఇటీవల జరిగిన పాఠశాల విద్యాకమిటీ ఎన్నికల్లో కూడా ఆయన పరోక్షంగా వైసిపికి సహకరించి ఆ పార్టీ మద్దతుదారులకే ఎస్ఎంసి ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులు ఇప్పించడంపై గుర్రుమంటున్నారు. ఇటీవల మండలంలోని గండ్రాజుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన విద్యా కమిటీ ఎన్నికలలో ఎస్ఎంసీ ఛైర్మన్‌ను పలమనేరు ఏఎంసీ ఛైర్మన్ నియమించుకోలేని పరిస్థితి కనిపించింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో మొత్తం 16 మంది సభ్యులు పోటీలో పాల్గొనగా 13 మంది సభ్యులు వైసీపీ మద్దతదారులు ఉండటంతో ఎస్ఎంసీ ఛైర్మన్‌గా వైసీపీకి చెందిన మద్దతుదారుడు వెంకరమణను ఛైర్మన్‌గా, సుబ్బమ్మను వైస్ ఛైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టిడిపి మద్దతుదారులు ముగ్గురు సభ్యులే మిగిలారు. దీంతో జరిగిన విద్యా కమిటీ ఎన్నికలలో ఎస్ఎంసీ ఛైర్మన్ కూడా వైసీపీ మద్దతుదారులకు అందడంతో టిడిపి శ్రేణులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవి. ఆ పదవిలో ఉన్న వ్యక్తి తన సొంత పంచాయతీలో ఎస్ఎంసీ ఛైర్మన్‌ను ఎన్నుకోలేని దౌర్భాగ్య పరిస్థితి నెలకొనడం మాత్రం జనంలో పరువుపోయేలా మారింది. ఇదిలా ఉంటే త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధిక్యం కైవశం చేసుకుంటుందో లేక ఏఎంసి ఛైర్మన్ చేజేతులా పదవులు వైసిపికి కట్టబెట్టేస్తారా అనేది మాత్రం కాలం నిర్ణయించనుంది. మరీ విచిత్రంగా ఎస్ఎంసి ఛైర్మన్‌ను, వైస్ ఛైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన వారిని వైసీపీ మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ప్రహల్లాద, నాయకులు శ్రీరాములురెడ్డి, గిరిరాజారెడ్డి, రాధన్న, కిషోర్, భాస్కర్ తదితరులు దుశ్శాలువతో, పూలమాలలతో ఘనంగా సన్మానించడం కొసమెరుపు.

## మూడుసార్లు ప్రథమం.. రాష్ట్ర స్థాయికి దూసుకెళ్లిన పవిత్రారెడ్డి

### సేవా సంకల్ప అభియాన్‌లో జిల్లా విజేతగా మెరిసిన తిరుపతి రూరల్ విద్యార్థిని



తిరుపతి, అక్టోబర్ 4 ప్రభాతవార్త :

తిరుపతి రూరల్ మండలం అడపారెడ్డిపల్లికి చెందిన మద్దేరి పవిత్రారెడ్డి ప్రతిభతో మెరిసి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించింది. సేవా సంకల్ప అభియాన్-2026 (వికసిత్ భారత్ 2047) కింద నిర్వహించిన స్పీచ్ పోటీల్లో వరుసగా మూడు స్థాయిల్లో ప్రథమ స్థానాలు సాధించి జిల్లా విజేతగా నిలిచింది. మద్దేరి పట్టాభిరెడ్డి, సుమలత దంపతుల కుమార్తె అయిన పవిత్రారెడ్డి చంద్రగిరిలోని రాయల్ విక్టరీ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. సెప్టెంబర్ 26న జరిగిన పాఠశాల స్థాయి పోటీల్లో ప్రథమ స్థానాన్ని దక్కించుకుని మండల స్థాయికి ఎంపికైంది. అనంతరం సెప్టెంబర్ 28న జరిగిన చంద్రగిరి మండల స్థాయి పోటీల్లోనూ ప్రథమంగా నిలిచి జిల్లా స్థాయికి అర్హత సాధించింది. అక్టోబర్ 3న తిరుచానూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో కూడా ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత పొందింది. ఈ నెల 9న అమరావతిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆమె పాల్గొననుంది. పాఠశాల, మండల, జిల్లా స్థాయిల్లో వరుసగా ప్రథమ స్థానాలు సాధించి ప్రతిభ చాటిన పవిత్రారెడ్డిని తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం, గ్రామస్తులు అభినందించారు. రాష్ట్ర స్థాయిలోనూ విజయం సాధించాలని ఆకాంక్షి ంచారు.

## రేపు తాతయ్యగుంట్ల గంగమ్మ ఆలయంలో వరుణహోమం




తిరుపతి, అక్టోబర్ 4ప్రభాతవార్త:

రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలకు, రైతులకు మేలు కలగాలని ఆకాంక్షి స్తూ దేవదాయశాఖ ఆధ్వర్యంలె తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ ఆలయంలో మంగళవారం నుండి వరుణహోమం జరిపిస్తున్నారు. మంగళవారం ఉదయం 14 మంది వేదపండడితులతో వరుణ హోమం, వరుణ జపం చేపడుతున్నారు. రేపు ఉదయం 10.30 గంటలకు అమ్మవారికి 108 బిందెలతో అమ్మవారికి జలాభిషేకం భక్తిశ్రద్ధలతో వైభవముగా నిర్వహిస్తారు. భక్తులు ,తిరుపతి ప్రజలందరూ ఈ వైదిక పుజాకార్యక్రములలో పాల్గొనవలెనని ఆలయ ఛైర్మన్ నైనార్ మహేష్ యాదవ్ ,ఈఓ ఎ. జయకుమార్ కోరారు.

## గెస్ట్ హౌస్‌లో వ్యభిచార కార్యకలాపాలు

### - గెస్ట్‌హౌస్ మేనేజర్‌తో పాటు ముగ్గురు విటులు అరెస్ట్- 28000 నగదు స్వాధీనం

తిరుపతి క్రైమ్, అక్టోబర్ 4, ప్రభాతవార్త:

తిరుపతి అలిపిరి పోలీసులకు అందిన పక్కా సమాచారం మేరకు నగరంలోని శివజ్యోతి నగర్‌లో గల శ్రీనివాస గెస్ట్ హౌస్‌లో వ్యభిచార కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలుసుకుని అలిపిరి పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. పోలీసు సిబ్బంది, పంచాయతీదారుల సమక్షంలో గెస్ట్ హౌస్‌లో తనిఖీలు చేపట్టగా, మొదటి అంతస్తులోని మూడు గదుల్లో అనుమానాస్పద పరిస్థితుల్లో ఉన్న ముగ్గురు పురుషులు, నలుగురు మహిళలను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో శ్రీనివాస గెస్ట్ హౌస్ మేనేజర్ సంకర్ జీవితం (37)తో పాటు తిరుపతికి చెందిన చింత కదిరయ్య (35), సుంకర లక్ష్మీపతి (29), మాదిరి హరి (31)లను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల విచారణలో గెస్ట్ హౌస్ మేనేజర్ వివిధ ప్రాంతాల నుంచి మహిళలను తీసుకువచ్చి గెస్ట్ హౌస్‌లో వ్యభిచార కార్యకలాపాలకు అవకాశం కల్పిస్తూ, విటుల నుంచి డబ్బులు వసూలు చేసేవాడు. తనిఖీల సందర్భంగా వ్యభిచార కార్యకలాపాలకు ఉపయోగించినట్లు గుర్తించిన కండోములు , మొత్తం రూ.28,000 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో గెస్ట్ హౌస్ మేనేజర్ వద్ద రూ.22,000, విటుల వద్ద మొత్తం రూ.6,000

## గురువుకు గౌరవం.. విద్యకు గౌరవం

### 300 మంది ఉపాధ్యాయులకు బెస్ట్ టీచర్ అవార్డులు

### విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో గురువులదే కీలక పాత్ర: పులివర్తి నాని

తిరుపతి విద్య, అక్టోబర్ 4, ప్రభాతవార్త:



విద్యార్థులకు పాఠాలు బోధించడంతో పాటు వారి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్ది, భవిష్యత్తుకు బాటలు వేసే ఉపాధ్యాయుల సేవలకు గుర్తింపు లభించింది. అప్పుస్మా ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతి చిగురువాడలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన బెస్ట్ టీచర్ అవార్డ్స్-2026 కార్యక్రమంలో విద్యారంగంలో విశేష సేవలు అందిస్తున్న 300 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (పులివర్తి నాని) మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి అత్యంత గౌరవప్రదమైన సేవా వృత్తి అన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, బాధ్యత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర కీలకమన్నారు. తుడా చైర్మన్ డా. డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ.. రక్తసంబంధం లేకపోయినా విద్యార్థులను కన్నబిడ్డల్లా భావించి వారి భవిష్యత్తుకు బాటలు వేసేది ఉపాధ్యాయులేనన్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే డా. కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి సరైన దిశానిర్దేశం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. టీటీడీ బోర్డు సభ్యుడు జి. భాను ప్రకాష్ రెడ్డి, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఎం. సుగుణమ్మ, తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్ తదితరులు ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి, వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అప్పుస్మా ప్రతినిధులు తెలిపారు. గత ఏడాది కూడా సుమారు 500 మంది ఉపాధ్యాయులను సత్కరించినట్లు, ఆ కార్యక్రమానికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అప్పుస్మా రాయలసీమ జోన్ అధ్యక్షులు డా. ఎన్. విశ్వనాథ్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. టి. వెంకటేశ్వర్లు, స్లేట్ స్కూల్ అధినేత వాసిరెడ్డి అమర్‌నాథ్, అప్పుస్మా తిరుపతి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కార్యక్రమాలు విస్తృతం చేయండి

తిరుపతి, అక్టోబర్ 4ప్రభాతవార్త:



తిరుపతి ఐటిడిపి నాయకులు తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంట్ ఐటిడిపి ఇన్‌ఛార్జ్ యాచేంద్ర నాయుడు, అసెంబ్లీ ఐటిడిపి అధ్యక్షుడు మునిచంద్ర, ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం పాల్గొన్నారు పార్టీ కార్యక్రమాలను, ప్రభుత్వ విధానాలను సామాజిక మాధ్యమాల వేదికగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విశేష ప్రతిభ కనబరిచినందుకు తిరుపతి అసెంబ్లీ ఐటిడిపి అధ్యక్షుడు మునిచంద్ర పనితీరును పార్టీ నాయకత్వం గుర్తించింది. పార్టీ అధిష్ఠానం ఆయనకు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను బహూకరించింది.

## జనసేన అధికార ప్రతినిధికి స్వాగతం

శ్రీకాళహస్తి అక్టోబర్ 04 ప్రభాతవార్త:



జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కుసుంపూడి శ్రీనివాస్ శ్రీకాళహస్తి దేవస్థానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు కుప్పాల వెంకటేష్ అలియాస్ దుమ్ము ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వామి వారి దర్శనం అనంతరం వేద పండితులచే ఆశీర్వచనాలు ఇప్పించారు. అనంతరం శ్రీకాళహస్తి ప్రసిద్ధి చెందిన పాలకోవాను శ్రీనివాస్‌కు అందజేసి ఆత్మీయంగా సత్కరించారు. జనసేన నాయకులు గరిక సురేష్, చింతా వెంకటరమణ యాదవ్, దినేష్ తదితర జనసైనికులు పాల్గొన్నారు.

## గణితంలో దిట్ట.. డాక్టర్ సిఎస్‌కె రాజు!

### ప్రపంచ గణిత మేధావుల్లో 94 స్థానం

### ఘనంగా సత్కరించిన మానవతా సంస్థ

చిట్వేలి, అక్టోబర్ 4, ప్రభాతవార్త:

కష్టాలు, పరిమిత అవకాశాలను అధిగమించి విద్యను జీవిత మార్గంగా ఎంచుకుని ప్రముఖ గణిత శాస్త్రవేత్త, పరిశోధకుడు, విద్యావేత్తగా ఎదిగి, ఇటీవల ప్రపంచ గణిత మేధావుల్లో 94వ స్థానం సాధించిన డాక్టర్ చక్రవర్తుల శివకృష్ణంరాజు ప్రస్థానం పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. చిట్వేలి మండలం, మైలపల్లి రాచపల్లి గ్రామంలోని సామాన్య రైతు కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన డాక్టర్ రాజు నిరంతర కృషి, పట్టుదలతో ఉన్నత విద్యను అభ్యసించి గణితం, అంతరశాఖ పరిశోధన రంగాల్లో ప్రత్యేక గుర్తింపు సాధించారు. భారత్‌తో పాటు విదేశాల్లోని పలు ప్రముఖ విద్యా, పరిశోధనా సంస్థల్లో పనిచేసిన ఆయన దక్షిణ కొరియాలోని హన్యాంగ్ యూనివర్సిటీలో విజిటింగ్ పోస్ట్‌డాక్టోరల్ పరిశోధకుడిగా కూడా పరిశోధనా అనుభవాన్ని పొందారు. ప్రస్తుతం బెంగళూరులోని కేంబ్రిడ్జ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా బోధన, పరిశోధన, విద్యార్థుల మార్గదర్శకత్వం, విద్యా అభివృద్ధి కార్యక్రమాల్లో సేవలందిస్తున్నారు. కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్‌ను గణిత నమూనాలతో అనుసంధానిస్తూ ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్స్, ఫిజిక్స్ ఇన్‌ఫార్మ్డ్ న్యూరల్ నెట్‌వర్క్స్, రిగ్రెషన్ మోడల్స్ వంటి ఆధునిక సాంకేతికతలను కూడా పరిశోధనలో వినియోగిస్తున్నారు. డాక్టర్ రాజు 200కు పైగా పరిశోధనా వ్యాసాలను రచించారు. ఆయన పరిశోధనలకు అంతర్జాతీయ స్థాయిలో వేలాది సైటేషన్లు లభించాయి. 2020 నుంచి 2025 వరకు వరుసగా స్టాన్‌ఫోర్డ్/ఎల్సేవియర్ టాప్ సైటెడ్ రీసెర్చర్స్ జాబితాలో గుర్తింపు లభించింది. పరిశోధనతో పాటు పీహెచ్‌డీ విద్యార్థులకు మార్గదర్శకత్వం, పరిశోధనా పరిపాలన, అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమాలు, ఆహ్వానిత ఉపన్యాసాలు, అంతర్జాతీయ పరిశోధనా జర్నల్లకు సమీక్షకుడిగా, సంపాదకీయ మరియు విద్యాబాధ్యతల్లోనూ ఆయనప్రస్తుతం సేవలందిస్తున్నారు.



రాజును సత్కరిస్తున్న మానవతా సభ్యులు, డాక్టర్ శివ కృష్ణంరాజు (ఫైల్ ఫోటో)



**చిట్వేలి మానవతా శాఖ సత్కారం:**

స్థానిక మండల వాసి ప్రపంచ అగ్రసేని గణిత మేధావుల్లో రాణిస్తున్న డాక్టర్ ఎస్ కే రాజును శనివారం స్థానిక ఉన్నత పాఠశాల వేదికగా హెచ్ఎం దుర్గరాజు ఆధ్వర్యంలో చిట్వేలి మానవతా శాఖ ఘనంగా సత్కరించారు. ఉన్నత పాఠశాల నుంచి చదివి ప్రపంచం గుర్తించేస్తాయికి ఎదిగిన తన కీర్తి ఖిమండలానికి మణిహారమని" మానవతా సభ్యులు తిరుమల విశ్వనాథం ఉమామహేశ్వర్ రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు రంగారెడ్డి, దొడ్లవాగు శ్రీనివాసులు, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పేర్కొన్నారు. శాలువా, మేమెంటో, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఇందులో మానవతా ముఖ్య సభ్యులు మునిరావు, సాయిరాం, నరసరామయ్య, కావేరి చంద్ర ,పాఠశాల చైర్మన్ శివ ప్రసాద్ గౌడ్ సభ్యులు పంది కాళ్ళ మణి, ఓబిలి పెంచలయ్య, యానాది రాజు, మానవత సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎం రాచపల్లి యువత తదితరులు పాల్గొన్నారు.

**విద్య తోనే సమాజంలో గుర్తింపు:**

పేద ధనిక వ్యత్యాసాన్ని దూరం చేస్తూ సమాజంలో నిజమైన గుర్తింపు విద్యతోనే సాధ్యమని డాక్టర్ రాజు ఉన్నత పాఠశాల విద్యార్థులకు సూచించారు. తను మాట్లాడుతూ ముఖ్యంగా గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు పరిస్థితులను చూసి నిరుత్సాహపడకుండా నిరంతర అభ్యాసం, క్రమశిక్షణ, సహనం, పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. "జీవితంలో మన ప్రారంభ పరిస్థితులు కష్టంగా ఉండవచ్చు. కానీ మనం ఎక్కడికి చేరుకోవాలో అవి నిర్ణయించాల్సిన అవసరం లేదు. విద్య, పట్టుదల, ముందుకు సాగాలనే ధైర్యం జీవిత గమనాన్నే మార్చగలవు" అనే ఆయన సందేశం నేటి యువతకు గొప్ప స్ఫూర్తినిస్తోంది.